మన.. ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం...

B9 NEWS
నిజం - మా ఇజం

PUBLISHED FROM: Telangana & Andhrapradesh

సంపుటి : 01 | సంచిక : 253 | సోమవారం | 05-10-2026 | ఎడిటర్ : పులిజ్వాల చంద్రకాంత్ | పేజీలు : 08 | వెల : 05/-



ఫైదుబాయ్ దాడి


భారత పైలట్ చెప్పిన షాకింగ్ నిజాలు



ఫైదుబాయ్ విమానంలో కాక్‌పిట్ దాడి ఘటన
ప్రార్థన పేరుతో కెప్టెన్‌పై దాడికి యత్నించిన కో-పైలట్
ప్రాణాలకు తెగించి పోరాడిన భారత పైలట్ స్మిత్ మచ్చర్
ఇజ్రాయెల్ ప్రధానికి ఘటన వివరాలు తెలిపిన కెప్టెన్
దీనిని ఉగ్రప్రయత్నంగా భావిస్తున్న యూఏఈ అధికారులు

మన ప్రజాపక్షం,ఢిల్లీ

దుబాయ్–టెల్ అవీవ్ ఫ్లైదుబాయ్ విమానంలో సెప్టెంబర్ 30న జరిగిన కాక్‌పిట్ దాడి ఘటనలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. విమానం నడుపుతున్న భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్.. తనపై కో-పైలట్ ఎలా దాడి చేశాడో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో మాట్లాడుతూ వివరించారు. ప్రార్థన చేసుకుంటానని చెప్పి, వెనుక నుంచి దాడికి పాల్పడ్డాడని ఆయన తెలిపారు.కెప్టెన్ స్మిత్ మచ్చర్ చెప్పిన వివరాల ప్రకారం, విమానం గాల్లో ప్రయాణిస్తుండగా ఒమన్ దేశస్థుడైన కో-పైలట్ హమామ్ అల్-హమ్మామీ ప్రార్థన చేయాలని కోరాడు. దీనికి కెప్టెన్ అంగీకరించి, గౌరవపూర్వకంగా తన దృష్టిని ముందు వైపు కేంద్రీకరించారు. నాలుగైదు నిమిషాల తర్వాత, ఉన్నట్టుండి తన తల వెనుక భాగంపై బలమైన దెబ్బ తగిలింది. మొదట విమానానికి ఏదైనా సాంకేతిక సమస్య వచ్చిందని భావించానని, కానీ దెబ్బలు కొనసాగడంతో తన పక్కనే ఉన్న కో-పైలటే దాడి చేస్తున్నాడని గ్రహించానని మచ్చర్ వివరించారు.తీవ్ర గాయాలతో కంటిచూపు మసకబారినా, ఎలాగైనా కాక్‌పిట్ తలుపు తెరిచి బయట ఉన్నవారిని అప్రమత్తం చేయాలని ప్రయత్నించారు. మొదటిసారి



కూల్చివేత.. రుషికొండ భవనాలను ఏంచేద్దాం?

- రాష్ట్ర ప్రభుత్వంలో అంతర్మథనం
- రెండేళ్లుగా ఏ నిర్ణయం తీసుకోక ఊగిసలాట
- నిర్వహణ గుదిబండగా..

మన ప్రజాపక్షం

రుషికొండ భవనాలను ఏం చేద్దాం? అనే దానిపై కూటమి ప్రభుత్వం తర్జనభర్జన పడుతోంది. ఈ భవనాల వినియోగంలో ఎలా ముందుకెళ్లాలో తెలియక ఆపసోపాలు పడుతోంది. అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు సమీపిస్తోంది. ఇప్పటికీ ఒక నిర్ణయం తీసుకోలేకపోతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ భారీ భవంతును కట్టారు. అసలు ఎందుకు కట్టారు? దేని కోసం కట్టారు? అని చెప్పలేకపోయింది వైసీపీ. వైసీపీ మూడు రాజధానుల పాలనలో భాగంగా విశాఖ నుంచి పాలనకు ఈ విలువైన భవనాలను నిర్మించింది అనేది బహిరంగ రహస్యం. కానీ దానిని బాహటంగా చెప్పుకోలేక వైసీపీ మూల్యం చెల్లించుకుంది. రుషికొండ భవనాలపై ప్రచారం చేసి అధికారంలోకి వచ్చింది కూటమి. ఇప్పుడు అదే కూటమి ప్రభుత్వం ఈ ప్రజా భవనాల విషయంలో ఎటూ తేల్చలేకపోతే మాత్రం వైసీపీకి పట్టిన గతి టీడీపీ కూటమి ప్రభుత్వానికి దక్కుతుందనడంలో తప్పులేదు.

భారీ వ్యయంతో నిర్మాణం

విశాఖపట్నంలోని రుషికొండ భవన సముదాయం ఇప్పుడు ఒక పెద్ద గుదిబండలా మారింది. అప్పట్లో పర్యాటకుల కోసం ఉన్న హరిత రిసార్ట్స్‌ను కూల్చివేసి రూ. 450 కోట్లతో ఈ ప్యాలెస్‌ను నిర్మించారు. అన్ని రకాల నిబంధనలను తుంగలో తొక్కి చేపట్టిన ఈ నిర్మాణాలను నేడు పర్యాటక శాఖ క్రిమినల్ వేస్ట్ గా భావిస్తోంది. ప్రభుత్వ ధనాన్ని



రష్యా దాడి.. ఒకరి మృతి

ఉక్రెయిన్‌లో భారతీయ ఫార్మా కంపెనీపై రష్యా దాడి.. ఒకరి మృతి
ఉక్రెయిన్‌లో భారతీయ ఫార్మా కంపెనీపై రష్యా డ్రోన్ల దాడి
సుమీ నగరంలోని కుసుమ్ గ్రూప్ ప్లాంట్ దాదాపు ధ్వంసం
దాడిలో ఒకరు మృతి, పలువురికి తీవ్ర గాయాలు
దాదాపు రూ.400 కోట్ల నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా

మన ప్రజాపక్షం,ఉక్రెయిన్

రష్యా–ఉక్రెయిన్ యుద్ధం తీవ్ర రూపం దాల్చుతున్న వేళ, ఉక్రెయిన్‌లోని భారతీయ ఫార్మా కంపెనీపై భీకర దాడి జరిగింది. రష్యా ప్రయోగించిన డ్రోన్లు సుమీ నగరంలోని 'కుసుమ్ గ్రూప్'కు చెందిన ఫార్మా ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకున్నాయి. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. మృతులు, క్షతగాత్రుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని స్థానిక అధికారులు తెలిపారు.అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ దాడిలో ప్లాంట్‌లోని ప్రధాన నిర్మాణం దాదాపు పూర్తిగా ధ్వంసమైంది. డ్రోన్లు దాడి చేసిన ప్రాంతం నుంచి భారీగా పొగ కమ్ముకున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ దాడి వల్ల సుమారు రూ. 400 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. విశేషమేమిటంటే.. రెండేళ్లకు పైగా యుద్ధం జరుగుతున్నప్పటికీ, ఈ ప్లాంట్ నిరంతరాయంగా ఉత్పత్తిని కొనసాగిస్తూనే ఉంది. తాజా దాడితో కార్యకలాపాలు

ఓటమి భయంతోనే ఉపఎన్నికలను
అడ్డుకుంటున్నారు

బీజేపీ ఎంపీ డీకే అరుణ

మన ప్రజాపక్షం,హైదరాబాద్

ఖైరతాబాద్ శాసనసభ ఉపఎన్నికల్లో ఓటమి ఎదురవుతుందనే భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నిక జరగకుండా అడ్డుకునేందుకు పిటిషన్లు వేయిస్తోందని బీజేపీ ఎంపీ డీకే అరుణ తీవ్రస్థాయిలో విమర్శించారు. నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో



అమెరికాలో విషాదం..

రోడ్డు ప్రమాదంలో తెలంగాణ మహిళ దుర్మరణం

మృతురాలిని మహబూబాబాద్ జిల్లాకు చెందిన దారం సుప్రియగా గుర్తింపు
ఆమె ప్రయాణిస్తున్న కారును ట్రక్కు ఢీకొట్టడంతో మృతి
ఈ ఘటనలో మరో భారతీయ యువతికి తీవ్ర గాయాలు

మన ప్రజాపక్షం,అమెరికా

అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన మహిళ మృతి చెందారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలానికి చెందిన దారం సుప్రియ (31) ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఈ



కేరళలో పాత కేసు రీఓపెన్

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై విజిలెన్స్ విచారణ..

2006లో మలేషియన్ ఇంజనీర్ ఆత్మహత్య కేసులో తిరిగి దర్యాప్తుకు ఉత్తర్వులు
నాటి విచారణపై బాహ్య ఒత్తిళ్లు వచ్చాయన్న ఆరోపణల నేపథ్యంలో తాజా చర్యలు
కాంగ్రెస్ నేత వేసిన పిటిషన్ ఆధారంగా కేరళ హోంమంత్రి ఆదేశాలు
పాత కేసు ఫైళ్లను తెప్పించి సమగ్ర దర్యాప్తు చేపట్టనున్న విజిలెన్స్ బృందం



మన ప్రజాపక్షం,కేరళ

ప్రస్తుత భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై తాజాగా విజిలెన్స్ విచారణకు కేరళ ప్రభుత్వం

మన నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి చంద్రబాబుకు పంపిస్తున్నాడు

రేవంత్ రెడ్డి మన నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి చంద్రబాబుకు పంపిస్తున్నాడు: కవిత
కుప్పంకు నీళ్లిస్తూ పాలమూరు రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణ
రాష్ట్రంలో కరవు మండలాలను తక్షణమే ప్రకటించాలని ప్రభుత్వానికి డిమాండ్
రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ హామీ ఏమైందని సూటి ప్రశ్న
కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే రాష్ట్రంలో కరవు పరిస్థితులని విమర్శలు




మన ప్రజాపక్షం,హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపిస్తున్నారంటూ తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. కృష్ణా నది జలాలు పొరుగు రాష్ట్రంలోని కుప్పంకు వెళుతున్నాయని, కానీ మన మహబూబ్‌నగర్ రైతులకు మాత్రం చుక్క నీరు అందడం లేదని ఆమె తీవ్ర ఆగ్రహం

అమెరికా కావాలనే ఒంటరి
శక్తిగా మారింది

చైనా ఎదుగుదలతో ప్రపంచంలో కొత్త పోటీ
జైశంకర్ కీలక వ్యాఖ్యలు
అమెరికా, చైనాపై విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ కీలక వ్యాఖ్యలు
తన విధానాల్లో మార్పు చేసుకొని అమెరికా కావాలనే ఒంటరి శక్తిగా మారిందని స్పష్టం
అమెరికా- చైనా పోటీతో పరిస్థితులు మారిపోయాయన్న కేంద్ర మంత్రి



మన ప్రజాపక్షం,జర్మనీ

ప్రస్తుత ప్రపంచ భౌగోళిక రాజకీయాల్లో వేగంగా మారుతున్న సమీకరణాలపై భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం అమెరికా మారుతున్న తీరు, చైనా ఎదుగుదలే అంతర్జాతీయ స్థితిగతులను ప్రభావితం చేస్తున్న రెండు ప్రధాన అంశాలు అని స్పష్టం చేశారు. ఈ మేరకు జర్మనీలో జరిగిన మ్యూనిచ్ లీడర్స్ మీటింగ్‌లో విదేశాంగ మంత్రి విశ్లేషించారు. ప్రస్తుత అంతర్జాతీయ వ్యవస్థలో స్పష్టంగా కనిపిస్తున్న మొదటి మార్పు అమెరికా తన స్థానాన్ని, వ్యూహాన్ని మార్చుకోవడమే. ఆ దేశం ఇటీవల తీసుకుంటున్న నిర్ణయాల వల్ల అది స్వచ్ఛందంగా,

గ్రామస్థాయి నుంచే కులగణన సమావేశాలు జరగాలి

: మంత్రి పొన్నం ప్రభాకర్



జనగణనలో కులగణన చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఓబీసీ నేతలు డిమాండ్ చేశారు. హైదరాబాద్ శివారు శంషాబాద్‌లో తెలంగాణ పీసీసీ ఓబీసీ విభాగం ఆధ్వర్యంలో ఓబీసీ కులగణన బహిరంగ సభ నిర్వహించారు.

మన ప్రజాపక్షం,హైదరాబాద్

బలహీన వర్గాల హక్కులు పరిరక్షించాలన్నా, న్యాయస్థానాలు విధించిన 50 శాతం రిజర్వేషన్ల బారికేడ్లను బద్దలు కొట్టాలన్నా కులగణన ఒక్కటే మార్గమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో

All are Continues Second Page

అమెరికాలో విషాదం..

మొదటి పేజీ తరువాయి

ఘటనతో ఆమె కుటుంబంలో, మహబూబాబాద్ పట్టణంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.వివరాల్లోకి వెళితే.. ఉద్యోగరీత్యా అమెరికాలోని మిస్సోరిలో నివసిస్తున్న సుప్రియ, ఇవాళ తెల్లవారుజామున (భారత కాలమానం ప్రకారం) కారులో ప్రయాణిస్తున్నారు.



ఈ సమయంలో వారు ప్రయాణిస్తున్న కారును వెనుక నుంచి వేగంగా వచ్చిన ఒక ట్రక్కు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు సుప్రియ అక్కడికక్కడే మృతి చెందారు. ఆమెతో పాటు కారులో ఉన్న మరో భారతీయ యువతికి తీవ్ర గాయాలయ్యాయి.సుప్రియ భర్త కొడుమూరి రంజిత్, అత్తమామలు కొడుమూరి వెంకటేశ్వర్లు, రాధిక మహబూబాబాద్ పట్టణంలోని వీరభద్ర అపార్ట్‌మెంట్స్‌లో నివసిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు, మృతదేహాన్ని స్వదేశానికి తరలించే ఏర్పాట్లపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ వార్త తెలియడంతో ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.



పైదుబాయ్ దాడి

తలుపు తెరిచినా కో-పైలట్ దాన్ని మూసేశాడు. నేలపై పడి ఉన్న సమయంలో విమానం వేగంగా కిందికి దిగుతున్న శబ్దాలు, ప్రయాణికుల అరుపులు వినిపించాయని ఆయన చెప్పారు. “నాలో ఇంకా చివరి పోరాటం మిగిలి ఉందని భావించాను. ఇప్పుడు పోరాడకపోతే చనిపోతానని అనిపించింది” అని చెప్పిన మచ్చర్, రెండోసారి తన పూర్తి శక్తిని కూడదీసుకుని తలుపు తెరిచారు. వెంటనే విమాన సిబ్బంది, ప్రయాణికులు లోపలికి వచ్చి కో-పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు.ఈ ఘటనను యూఏఈ అధికారులు ఉగ్రవాద ప్రయత్నంగా అభివర్ణించారు. అనంతరం విమానాన్ని సౌదీ అరేబియాలోని తబుక్‌లో సురక్షితంగా ల్యాండ్ చేశారు. ప్రస్తుతం కెప్టెన్ స్మిత్ మచ్చర్ యూఏఈలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

ఓటమి భయంతోనే ఉపఎన్నికలను

అడ్డుకుంటున్నారు

మొదటి పేజీ తరువాయి

నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవడాన్ని ఎంపీ డీకే అరుణ తీవ్రంగా తప్పుపట్టారు. గతంలో పార్టీ ఫిరాయింపులను తీవ్రంగా వ్యతిరేకించిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక సిగ్గులేకుండా ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకుంటోందని మండిపడ్డారు. ప్రస్తుతం ఆ ఎమ్మెల్యేలు తాము ఏ పార్టీలో ఉన్నామో చెప్పుకోలేని దుస్థితిలో ఉన్నారన్నారు. రాష్ట్రంలో అద్భుత పాలన అందిస్తున్నామని, ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నేతలు.. మళ్లీ ప్రజల్లోకి వెళ్లేందుకు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. పాలనపై నమ్మకముంటే, ఫిరాయింపు ఎమ్మెల్యేలతో వెంటనే రాజీనామా చేయించి ఉపఎన్నికల్లో పోటీకి నిలబెట్టాలని సవాల్ విసిరారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలూ లోపాయికారీ ఒప్పందంతో పనిచేస్తూ రాష్ట్రాన్ని తీవ్రంగా అప్పులపాలు చేశాయని, అభివృద్ధిని కుంటుపరిచాయని డీకే అరుణ ఆరోపించారు. గతంలో ఖైరతాబాద్ సీటును బీజేపీ గెలుచుకుందని, రాబోయే రోజుల్లోనూ అక్కడ కమలం జెండానే ఎగురుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఏ పార్టీ ఉన్నా.. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు సమకూరుస్తోందని స్పష్టం చేశారు. స్వార్థ రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రజలు తగిన బుద్ధి చెప్పక తప్పదని డీకే అరుణహెచ్చరించారు.



రష్యా దాడి..
ఒకరి మృతి

మొదటి పేజీ తరువాయి

పూర్తిగా నిలిచిపోయాయి.భారతీయుడైన రాజీవ్ గుప్తా నేతృత్వంలో కుసుమ్ గ్రూప్ నడుస్తోంది. ఈ సంస్థ 1994లో భారతీయ ఔషధాలను ఉక్రెయిన్‌కు ఎగుమతి చేసే డిస్ట్రిబ్యూటర్‌గా ప్రారంభమై, ఆ తర్వాత సొంత బ్రాండ్లను మార్కెటింగ్ చేసింది. 2009లో సుమీ నగరంలో తయారీ ప్లాంట్‌ను స్థాపించింది. ఈ గ్రూప్ ఉక్రెయిన్, ఉజ్బెకిస్థాన్, కజకిస్థాన్ వంటి 9కి పైగా దేశాలకు 50 రకాల జనరిక్ ఔషధాలను విక్రయిస్తోంది.గత కొంతకాలంగా రష్యా.. చవకైన, వేగవంతమైన షాహెద్ డ్రోన్లతో ఉక్రెయిన్‌పై నిరంతరం దాడులు చేస్తోంది. ఈ డ్రోన్లను అడ్డుకోవడం ఉక్రెయిన్ వాయు రక్షణ వ్యవస్థలకు సవాలుగా మారింది.ఇదే సమయంలో, ఉక్రెయిన్ కూడా దేశీయంగా తయారుచేసిన ‘ఎఫ్‌పీ-7’ బాలిస్టిక్ క్షిపణిని ఈ వారంలో తొలిసారిగా ప్రయోగించినట్లు ప్రకటించింది. దీని పరిధి సుమారు 250 కిలోమీటర్లు కావడం గమనార్హం.

కేరళలో పాత కేసు రీఓపెన్

మొదటి పేజీ తరువాయి

ఆదేశించింది. ఆయన గతంలో కేరళ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యూడీ) సెక్రటరీగా పనిచేసిన సమయంలో వచ్చిన ఆరోపణలకు సంబంధించి ఈ విచారణ జరగనుంది. కాంగ్రెస్ నేత మలయిన్‌కీళు వేణుగోపాల్ సమర్పించిన పిటిషన్ ఆధారంగా, రాష్ట్ర హోంమంత్రి రమేశ్ చెన్నితాల ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.ఈ కేసు 2006 నాటిది. కేరళ రాష్ట్ర రవాణా ప్రాజెక్ట్ (కేఎస్‌టీపీ) కింద ఎంసీ రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగస్వామిగా ఉన్న పాటి-బెల్ కన్సార్టియం తరఫున పనిచేసిన మలేషియన్ సివిల్ ఇంజనీర్ లీ సీ బీన్, కేరళ నుంచి తిరిగి వెళ్లాక 2006 నవంబర్‌లో కౌలాలంపూర్‌లో ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన రాశారని చెబుతున్న సూసైడ్ నోట్‌లో అప్పటి పీడబ్ల్యూడీ సెక్రటరీగా ఉన్న జ్ఞానేశ్ కుమార్ పేరు ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రాజెక్టు పనుల్లో అవకతవకలు జరిగాయని, ఈ కేసులో 2006లో జరిగిన ప్రాథమిక విజిలెన్స్ విచారణ బాహ్య ఒత్తిళ్ల కారణంగా పక్కదారి పట్టిందని వేణుగోపాల్ తన పిటిషన్‌లో ఆరోపించారు.ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన హోంమంత్రి రమేశ్ చెన్నితాల, నాటి విచారణకు సంబంధించిన ఫైళ్లన్నింటినీ వెంటనే తమకు సమర్పించాలని ‘విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ బ్యూరో’ను (వీఏసీబీ) ఆదేశించారు. ఆనాటి దర్యాప్తు ఎలా జరిగిందీ, నిజంగానే ఏవైనా బయటి శక్తులు దానిని ప్రభావితం చేశాయా అనే కోణంలో ఈ ఫైళ్లను పరిశీలించనున్నారు. నాటి విచారణపై వచ్చిన జోక్యం ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరిపి, నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ డైరెక్టర్‌ను హోంమంత్రి ఆదేశించారు.అయితే, సూసైడ్ నోట్‌లో పేరు ప్రస్తావించినంత మాత్రాన లేదా తాజా విచారణకు ఆదేశించినంత మాత్రాన జ్ఞానేశ్ కుమార్ తప్పు చేసినట్లు నిర్ధారణ కాదని స్పష్టమవుతోంది. విజిలెన్స్ దర్యాప్తులో వెల్లడయ్యే వాస్తవాల ఆధారంగా ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకోనుంది.
ప్రస్తుతానికి పాత రికార్డులను పరిశీలించి, జోక్యం ఆరోపణలపై దృష్టి

మన నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి

చంద్రబాబుకు పంపిస్తున్నాడు

మొదటి పేజీ తరువాయి

వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత మూడేళ్లలో ఏ ఒక్క నీటిపారుదల ప్రాజెక్టుపై శ్రద్ధ పెట్టకపోవడం వల్లే రాష్ట్రం నేడు కరవుతో అల్లాడుతోందని విమర్శించారు.ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో కవిత మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని, ప్రభావిత మండలాలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఆమె డిమాండ్ చేశారు. ఎల్ నినో ప్రభావంపై శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమైందని ధ్వజమెత్తారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో కూడా కరవు మండలాలను ప్రకటించకపోవడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తోందన్నారు.“నార్లాపూర్ రిజర్వాయర్‌పై కొంతైనా ఖర్చు చేసి ఉంటే, ఈరోజు దాన్ని నింపుకొని కల్వకుర్తి ఆయకట్టుకైనా నీరందించే అవకాశం ఉండేది. దానివల్ల భూగర్భ జలాలు కూడా పెరిగేవి” అని కవిత అభిప్రాయపడ్డారు. కృష్ణా, గోదావరి నదుల్లో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ.. పాలమూరు-రంగారెడ్డి వంటి ఎత్తిపోతల పథకాలను నింపకుండా మన నీటిని ఏపీకి తరలిస్తున్నారని ఆరోపించారు.రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు కేవలం 6-7 గంటల కోతలతో సరిపెడుతున్నారని మండిపడ్డారు. విద్యుత్ కోతల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికే కాకుండా హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రధాన పట్టణాల్లోనూ తాగునీటి ఎద్దడి మొదలైందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కరవుతో నష్టపోతున్న రైతులకు, ప్రజలకు తమ పార్టీ అండగా ఉంటుందని, 60 నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జ్‌లు క్షేత్రస్థాయిలో పనిచేస్తారని కవిత భరోసా ఇచ్చారు.



అమెరికా కావాలనే ఒంటరి

శక్తిగా మారింది

మొదటి పేజీ తరువాయి

కావాలనే ఒక ఒంటరి శక్తిగా మారుతోందని వ్యాఖ్యానించారు. ఇక్కడ అమెరికా విషయంలో రాడికల్ రీపొజిషనింగ్ అనే పదం ఉపయోగించారు. రాడికల్ రీపొజిషనింగ్ అంటే ఏదైనా సంస్థ లేదా దేశం తన పాత ఇమేజ్, వ్యూహాలను పూర్తిగా మార్చేసి కొత్త విధానాన్ని ఎంచుకోవడం. ఇక్కడ అమెరికా విషయంలో తన పాత విదేశాంగ విధానాలను, వ్యూహాల్ని పూర్తిగా మార్చుకుంటోందని జైశంకర్ స్పష్టం చేశారు. ఇది పరిస్థితుల వల్లే వచ్చిన మార్పు కాదని, విధానపరంగా తీసుకున్న నిర్ణయం అని చెప్పుకొచ్చారు. ప్రతి విషయంలోనూ తానే ప్రపంచానికి పెద్దన్నలా ఉంటూ అందరికీ సాయం చేసే పాత పద్ధతిని పక్కనబెట్టి తన ప్రయోజనాలే ముఖ్యమనే ధోరణివైపు అమెరికా మారిందనే అర్థం వచ్చేలా జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

ఇక రెండో అంశం చైనా గురించి. చైనా తనను తాను అంతర్జాతీయంగా ఒక ప్రత్యేకమైన, విశిష్టమైన శక్తిగా భావిస్తోందని జైశంకర్ వ్యాఖ్యానించారు. చైనా ఎదుగుదల అంతర్జాతీయ వ్యవస్థను మరింత ప్రభావితం చేస్తోందన్నారు. చైనా ఆర్థిక, రాజకీయ సామర్థ్యాలు కూడా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని అన్నారు. ఈ క్రమంలోనే అమెరికా-చైనా మధ్య ప్రస్తుతం తీవ్రమైన పోటీ నెలకొందని జైశంకర్ పేర్కొన్నారు. అయితే ప్రపంచంలో పోటీ కేవలం రెండు అగ్రదేశాలకే పరిమితం కాలేదని, ఈ కారణంగానే ప్రతి దేశం తమ వద్ద ఉన్న శక్తులు లేదా అవకాశాల్ని ఆయుధంగా మలుచుకునే ప్రమాదకర పరిస్థితులకు దారితీసిందని హెచ్చరించారు. ఇలా దీనిని ఇతరులపై ఒత్తిడి తెచ్చేందుకు ఉపయోగించుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు దేశాల మధ్య పరస్పర ప్రయోజనాల కోసం సంబంధాలు కొనసాగుతున్నా, మరోవైపు అవసరమైన చోట తమ బలాలనే అస్త్రాలు ప్రయోగిస్తున్నాయని జైశంకర్ తెలిపారు.

అభివృద్ధి చెందుతున్న దేశాలకు కొత్త అవకాశాలు

ఇలాంటి సంక్లిష్ట పరిస్థితుల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ స్వప్రయోజనాల కోసం పలు ప్రాంతీయ కూటములను ఆశ్రయిస్తున్నాయని జైశంకర్ తెలిపారు. పెద్ద పెద్ద దేశాల వ్యవస్థల కంటే నిర్దిష్ట ప్రయోజనాల కోసం ఏర్పడుతున్న చిన్న సమూహాలే కీలకంగా మారుతున్నాయని జైశంకర్ ఉదాహరణలతో వివరించారు. ఇందులో భారత్ భాగస్వామ్యంతో రూపుదిద్దుకున్న క్వాడ్ , ఇండియా మిడిల్ ఈస్ట్-యూరప్ ఎకనామిక్ కారిడార్ , ఇంటర్నేషనల్ నార్త్ సౌత్ ట్రాన్స్‌పోర్ట్ కారిడార్ , ఇంటర్నేషనల్ సోలార్ అలియన్స్ , బ్రిక్స్ వంటి వేదికలు నిదర్శనం అని జైశంకర్ చెప్పారు. ఈ కూటముల ద్వారా అభివృద్ధి చెందుతున్న దేశాలు పరస్పర సహకారాన్ని బలోపేతం చేసుకోవడమే కాకుండా, అవసరానికి అనుగుణంగా అమెరికా- చైనాతో కూడా సంబంధాలు కొనసాగిస్తున్నాయని వివరించారు. భవిష్యత్తులో దేశాలు ఒకే దానిపై కాకుండా, తమ ప్రయోజనాలకు అనుగుణంగా అనేక దేశాలతో సంబంధాలు కొనసాగించాల్సి ఉంటుందని చెప్పారు.

అమెరికా- చైనా పోటీపై జైశంకర్ విశ్లేషణ

రెండు అగ్రదేశాలు అమెరికా- చైనా మధ్య తీవ్ర పోటీ నేపథ్యంలో ప్రపంచ దేశాలు బ్యాలెన్సింగ్ వ్యూహాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందని జైశంకర్ సూచించారు. అమెరికా- చైనా పోటీని ఆయన గోల్డిలాక్స్ సినారియోతో పోల్చారు. ఇక్కడ రెండు దేశాల మధ్య పరిస్థితి మరీ తీవ్రంగా ఉండకూడదని, అదే సమయంలో మరీ సన్నిహితంగా కూడా ఉండకూడదని, రెండింటి మధ్య సమతుల్యత అవసరం అని వివరించారు.

మాటలకే పరిమితం కాలేదు- నేరుగా రంగంలోకి దిగాం

రష్యా- ఉక్రెయిన్ మధ్య యుద్ధానికి ముగింపు పలికేందుకు భారత్ తన దౌత్య వ్యూహాన్ని మరింత వేగవంతం చేసిందని జైశంకర్ తెలిపారు. ఇన్ని రోజులు కేవలం చర్చలు, దౌత్యం ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించే స్థితి నుంచి ఇప్పుడు ఇరు దేశాలతో నేరుగా చర్చలు జరిపే స్థాయికి భారత్ చేరుకుందని ఆయన తెలిపారు. సంక్షోభాన్ని ముగించడమే తమ ప్రథమ లక్ష్యమని, అందుకోసం తీవ్రంగా కృషి చేస్తున్నట్లు వివరించారు. గత కొంత కాలంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ కూడా యుద్ధాన్ని ముగించాల్సిన సమయం వచ్చిందని బహిరంగంగా చెబుతూనే ఉన్నారు.

గ్రామస్థాయి నుంచే కులగణన సమావేశాలు జరగాలి

మొదటి పేజీ తరువాయి

నిర్వహించిన ‘ఓబీసీ గర్జన’ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేంద్రప్రభుత్వం చేపట్టే అధికారిక జనగణనలో తక్షణమే ప్రత్యేకంగా ఓబీసీ కాలమ్‌ను చేర్చేలా గ్రామస్థాయి నుంచి కేంద్రంపై ఒత్తిడి తేవాలని పొన్నం ప్రభాకర్? పిలుపునిచ్చారు.

దేశానికే ఆదర్శంగా కులగణన

సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం లక్ష మంది ఉద్యోగులతో సమగ్ర కులగణన చేపట్టి దేశానికే ఆదర్శంగా నిలిచిందని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కేబినెట్, అసెంబ్లీలో తీర్మానాలు చేసినా 50 శాతం పరిమితి నిబంధనతో అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటివరకు స్థానిక సర్పంచ్ పదవులకు కూడా నోచుకోని అతి బలహీన వర్గాలకు రాజ్యాధికార వాటా దక్కాలంటే కేంద్రం జనాభా లెక్కలు తేల్చాల్సిందేనని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి కులగణన సాధిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

ష్..రుషికొండ భవనాలను ఏంచేద్దాం?

మొదటి పేజీ తరువాయి

ఏ విధంగా దుర్వినియోగం చేయవచ్చో చెప్పడానికి రుషికొండ ప్యాలెస్ ఒక సజీవ నిదర్శనంగా మిగిలిపోయింది.ఈ భవనాలను ఎలాగైనా వినియోగంలోకి తీసుకురావాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ప్రాతిపదికన లీజుకు ఇచ్చేందుకు టెండర్లు పిలిచింది. ప్రారంభంలో కొన్ని బడా కార్పొరేట్ హోటళ్లు, ప్రఖ్యాత ఆతిథ్య రంగ సంస్థలు దీనిని లీజుకు తీసుకునేందుకు ముందుకు వచ్చినప్పటికీ, క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత వెనక్కి తగ్గాయి. ఈ ప్రాజెక్ట్‌ను చుట్టుముట్టిన లీగల్ ఇష్యూస్, పర్యావరణ అనుమతుల ఉల్లంఘనల కేసులను చూసి ఆ సంస్థలు ఈ భవనాలకు దూరంగా జరిగిపోయాయి. ప్రస్తుతం బడా సంస్థలు ముందుకు రాకపోవడంతో, చిన్న చిన్న సంస్థలే నామమాత్రపు ఆసక్తిని కనబరుస్తున్నాయి.

నిబంధనల అడ్డంకి..

కోస్తా నియంత్రణ మండలి పరిధిలో ఉండటంతో అనేక కఠినమైన నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం భవిష్యత్తులో అక్కడ ఎలాంటి అదనపు కార్యకలాపాలు లేదా పెద్దఎత్తున వ్యాపార నిర్వహణ చేయడం సాంకేతికంగా సాధ్యపడదు. ఒకవేళ గతంలో మాదిరిగా పర్యాటకులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న టూరిజం రిసార్ట్స్‌ను అలాగే ఉంచినట్లయితే, రాష్ట్ర ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయం వచ్చేది. కానీ, కేవలం స్వార్థపూరిత రాజకీయ ప్రయోజనాల కోసం వాటిని నేలమట్టం చేసి, ఇప్పుడు ఎటూ వ్ష?డుకోలేని దుస్థితికి తెచ్చిపెట్టారు.ప్రజాధనంతో నిర్మించిన ఈ ప్యాలెస్ ఏ రకంగానూ ప్రభుత్వానికి ఉపయోగపడకపోగా, నిరంతరం వివాదాలకు కేంద్రబిందువుగా మారింది. అడ్డగోలు నిబంధనల ఉల్లంఘనల కారణంగా కోర్టుల్లో కేసులు నలుగుతుండటంతో, దీని నిర్వహణపై నిర్ణయం తీసుకోవడం సర్కారుకు కూడా కత్తిమీద సాములా తయారైంది. ప్రజాధనాన్ని ఏ విధంగా గాలికి వదిలేశారో చెప్పడానికి రుషికొండ భవనాలు అప్పట్లో ఒక ప్రణాళికా లోపానికి ప్రతీకగా నిలిస్తే, నేడు చట్టపరమైన చిక్కులతో నిరుపయోగంగా మారిన ఒక రాజకీయ వ్యర్థంగా మిగిలిపోయాయి.

మంత్రి కీలక ప్రకటన..

రుషికొండ భవనాల విషయంలో త్వరలో తేల్చేస్తామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తాజాగా ఈ అంశం మాట్లాడిన ఆయన క్లారిటీ ఇచ్చారు. కానీ గత రెండేళ్లుగా ఎటూ తేలకపోతోంది. గత ఏడాదిసెప్టెంబరులో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రుషికొండ భవనాన్ని పరిశీలించారు. భవనాన్ని వినియోగంలోకి తేవాలని పర్యాటక శాఖ మంత్రి దుర్గేశ్‌ని కోరారు. ఆ వెంటనే ప్రభుత్వం ప్రకటన జారీచేసింది. ఆతిథ్య రంగంలో తాజ్, ఫెమా, వరుణ్ వంటి గ్రూపులు భవనాన్ని లీజుకు తీసుకునేందుకు ముందుకువచ్చాయి. అయితే, తాము సూచించిన కొన్ని మార్పులు చేస్తే తీసుకుంటామని మెలిక పెట్టాయి. దీంతో ప్రభుత్వం ముగ్గురు మంత్రులతో సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ పలుమార్లు భవనాన్ని పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. మరోవైపు, పలు సంస్థల సూచనల మేరకు రుషికొండపై ఖాళీగా ఉన్న 9 ఎకరాల భూమి కూడా ఇస్తామని ప్రభుత్వం మరోసారి ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన జారీచేసింది. అయితే, 7.5 ఎకరాలు సీఆర్‌జెడ్‌లో ఉండడంతో 1.5 ఎకరాల్లోనే నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉంది.



ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల కోసం ఎదురుచూపులు!

తిరుమలగిరి,మన ప్రజాపక్షం:
తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడంతో తొలివిడతలో భాగంగా పునాది స్థాయి నిర్మాణాలు పూర్తి చేసిన లబ్ధిదారులు బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. పునాది స్థాయి నిర్మాణాలు ఏర్పాటు చేసుకుని దాదాపు రెండు నెలలు గడిచినా ఇప్పటివరకు బిల్లులు మంజూరు కాలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇళ్ల నిర్మాణానికి సంబంధించి గ్రామపంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ అధికారులు పరిశీలించి, ఫోటోలు తీసి సంబంధిత అధికారులకు పూర్తి సమాచారాన్ని అందజేసిన కూడా రెండు నెలలు గడుస్తున్నా బిల్లుల జాడ కనిపించడం లేదని వారు తెలిపారు. ప్రభుత్వం నుంచి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో సొంతంగా ఒక గూడు నిర్మించుకొని జీవించవచ్చని ఆశించిన పేద కుటుంబాలకు బిల్లుల జాప్యం ఇబ్బందిగా మారిందన్నారు.ఇప్పటికే అప్పులు చేసి ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించామని, బిల్లులు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని లబ్ధిదారులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి ఆలస్యం చేయకుండా ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను వెంటనే మంజూరు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన సదస్సు

సూర్యాపేట,మన ప్రజాపక్షం:
కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సూర్యాపేట సర్కిల్ పరిధిలోని 33/11కేవీ సబ్‌స్టేషన్, జమ్మిగడ్డ ప్రాంగణంలో అక్టోబర్ 2 నుంచి 4వ తేదీ వరకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకు పెద్ద సంఖ్యలో విద్యుత్ వినియోగదారులు హాజరై పథకానికి సంబంధించిన సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు, పథకం కోసం నమోదు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట సర్కిల్ ఎస్ఈ పి.యాదగిరి, డీఈ (టెక్నికల్) ఎన్.వెంకటకృష్ణయ్య, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, అకౌంట్స్ సిబ్బంది, ఆపరేషన్ ఏడీలు, ఏఈలు, రెడ్కో శాఖ, బ్యాంక్ సిబ్బంది,వివిధ యూనియన్ నాయకులు, విద్యుత్ వినియోగ దారుల సేవా శాఖ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఈ పి.యాదగిరి ఒక ప్రకటనలో కోరారు.




ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

బల్మూర్,మన ప్రజాపక్షం:
అచ్చంపేట నియోజకవర్గం బల్మూర్ మండలంలోని చెంచు గూడెంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో టిపీసీసీ ఉపాధ్యక్షులు,డీసీసీ అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే అందజేశారు. ఇల్లు లేని పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే వంశీకృష్ణ పేర్కొన్నారు.పేద కుటుంబాలకు సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

45 రోజులు గడిచినా 'ఎస్పీఆర్' పేరు మార్పు ప్రతిపాదనలు ఏవీ?

యాజమాన్యానికి నల్లగొండ డీఈవో గట్టి హెచ్చరిక
కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

నల్లగొండ,మన ప్రజాపక్షం:
నల్లగొండ డీవీకే రోడ్డులో మరియు కొండమల్లేపల్లిలో నిర్వహిస్తున్న ఎస్పీఆర్ హైస్కూళ్ల పేర్ల మార్పు వ్యవహారం మరోసారి చర్చనీయాంశమైంది. పేరు మార్పునకు సంబంధించిన ప్రతిపాదనలు 45 రోజులు గడిచినా సమర్పించకపోవడంపై నల్లగొండ జిల్లా విద్యాశాఖాధికారి పి.సుశేంద్ర రావు యాజమాన్యానికి గట్టి హెచ్చరిక జారీ చేశారు.ఈ మేరకు ఆర్సీ నం.1455/బి2/2024, తేదీ 29-09-2026తో డీఈవో కార్యాలయం అధికారిక ప్రొసీడింగ్స్ జారీ చేసింది. సంబంధిత కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో 'ఎస్ పి ఆర్'పదాన్ని ప్రిఫిక్స్ లేదా సఫిక్స్‌గా కలిగి లేని కొత్త పేరుతో నిబంధనలకు అనుగుణంగా పాఠశాల పేరు మార్పు ప్రతిపాదనలను సమర్పించుకోవచ్చని గతంలోనే సూచించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.అయితే గడువు ముగిసినా శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ ఎడ్యుకేషనల్ సొసైటీ యాజమాన్యం ఇప్పటివరకు ప్రతిపాదనలు సమర్పించలేదని డీఈవో స్పష్టం చేశారు. వెంటనే పేరు మార్పు ప్రతిపాదనలతో పాటు ఇంతకాలం ఎందుకు సమర్పించలేదో కారణాలను కూడా తెలియజేయాలని ఆదేశించారు.కోర్టు ఆదేశాలను ఉల్లంఘించే ఎలాంటి చర్యలు జరిగినా సంబంధిత కరస్పాండెంట్ బాధ్యత వహించాల్సి ఉంటుందని, తదుపరి చట్టపరమైన చర్యల కోసం ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు, పాఠశాల విద్యాశాఖ,హైదరాబాద్‌కు ప్రతిపాదనలు పంపుతామని డీఈవో హెచ్చరించారు. ఈ వ్యవహారంపై ఆర్టీఐఎస్ఎస్ వ్యవస్థాపకుడు, జాతీయ అధ్యక్షుడు కేతావత్ బాబురామ్ నాయక్, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కలకుంట్ల వినోదాచారి స్పందిస్తూ విద్యాశాఖ తాజా ఉత్తర్వులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, కోర్టు ఆదేశాలు మరియు విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి కార్యకలాపాలు జరగకుండా అధికారులు పర్యవేక్షించాలని కోరారు.



60 వేల మంది విద్యార్థులకు అల్పాహారం

మునగాలలో రూ. 9.60 కోట్లతో కమ్యూనిటీ కిచెన్
అక్టోబర్ 6న శంకుస్థాపనకు ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క

సూర్యాపేట,మన ప్రజాపక్షం:
జిల్లాలోని 1,029 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న సుమారు 60 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించేందుకు మునగాల మండలంలో రూ. 9.60 కోట్లతో అత్యాధునిక కమ్యూనిటీ కిచెన్ ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు అక్టోబర్ 6న మధ్యాహ్నం 12 గంటలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల,పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు.మునగాల మండలంలో జాతీయ రహదారి పక్కన, మునగాల–మాధారం మధ్య ఎంపిక చేసిన స్థలంలో ఈ కేంద్రీకృత వంటశాలను నిర్మించనున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులకు ఒకే కేంద్రం నుంచి ఆహారం తయారు చేసి, ప్యాకింగ్, రవాణా, పంపిణీ చేసే విధంగా ప్రాజెక్టును రూపొందిస్తున్నారు. దేశంలోనే అత్యాధునిక సదుపాయాలతో ఈ వంటశాలను అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.కమ్యూనిటీ కిచెన్ నిర్మాణానికి సింగరేణి కంపెనీ రూ. 9.60 కోట్ల విరాళం అందించింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి చేసిన విజ్ఞప్తుల మేరకు సింగరేణి ఈ నిధులను సమకూర్చినట్లు మంత్రి తెలిపారు. విద్యార్థులకు నేరుగా ప్రయోజనం చేకూర్చే ఈ కార్యక్రమానికి సహకరించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సింగరేణి కంపెనీకి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి కృతజ్ఞతలు తెలిపారు.హరేకృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ సహకారంతో ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నారు. జిల్లాలోని సుమారు 1,029 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న దాదాపు 60 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం అల్పాహారం తయారు చేసి సరఫరా చేయడం కమ్యూనిటీ కిచెన్ ప్రధాన ఉద్దేశం. అవసరాన్ని బట్టి ఎంపిక చేసిన కొన్ని జూనియర్ కళాశాలలకు మధ్యాహ్న భోజనం అందించే అంశాన్ని కూడా ప్రణాళికలో చేర్చారు.వంటశాలలో ఆహార తయారీ, ప్యాకింగ్, రవాణా, పంపిణీ కోసం సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఆహార నాణ్యత, పోషక విలువలు, పరిశుభ్రత, సురక్షిత నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. విద్యార్థులకు పాఠశాల వేళల్లో పోషకాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, సంక్షేమానికి తోడ్పడేలా ఈ కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు.కమ్యూనిటీ కిచెన్ నిర్మాణం, నిర్వహణ, ఆహార తయారీ, విద్యాసంస్థలకు సరఫరా వంటి అంశాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్వయంగా పర్యవేక్షించనున్నారు. కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, సంబంధిత అధికారులు, అమలు భాగస్వాములతో సమన్వయం చేస్తూ ప్రాజెక్టు పనుల పురోగతిని సమీక్షిస్తానని మంత్రి తెలిపారు. నిర్మాణం పూర్తయిన తర్వాత ఈ వంటశాల ద్వారా సూర్యాపేట జిల్లాలోని వేలాది మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందనుంది.



జంగాల రాజేశ్వర్‌రావు సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ఖమ్మం,మన ప్రజాపక్షం:కాలేయ సంబంధిత వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఖమ్మంలో "జంగాల రాజేశ్వర్‌రావు సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్" ఆధ్వర్యంలో ఆదివారం నాడు ఉచిత హెపటైటిస్-బి టీకా మరియు లివర్ ఫైబ్రోస్కాన్ క్యాంప్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ సునీల్ కుమార్ జంగాల (ఎం.డి, డి.ఎం) మరియు డాక్టర్ స్వాతి జంగాల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ శిబిరానికి విచ్చేసిన 149 మంది బాధితులకు ఉచితంగా వైద్య పరీక్షలు మరియు కన్సల్టేషన్ నిర్వహించారు. వచ్చిన వారిలో అవసరమైన 90 మందికి ఉచితంగా లివర్ ఫైబ్రోస్కాన్ పరీక్షలు చేశారు. మొత్తం 59 మందికి ప్రాణాంతక హెపటైటిస్-బి నుండి రక్షణ కల్పించేలా ఉచితంగా టీకాలను వేయడం జరిగింది.ఫౌండేషన్ ద్వారా టీకాలు, మెడికల్ కిట్లు మరియు ల్యాబ్ సేవలను ప్రజలకు ఉచితంగా అందించి తమ సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ శిబిరం స్థానిక ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా నిలిచింది.



పోలీసు ఉద్యోగ ఆశావహుల ఉచిత శిక్షణకు ఎంపిక పరీక్ష

జిల్లాలోని 4 పరీక్షా కేంద్రాల్లో హాజరైన 1220 మంది యువత
ఎంపిక పరీక్ష సరళి పరిశీలించిన జిల్లా ఎస్పీ కె.నరసింహ


సూర్యాపేట,మన ప్రజాపక్షం:
ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు సూర్యాపేట జిల్లా యంత్రాంగం, జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో అందించనున్న 45 రోజుల ఉచిత శిక్షణలో అభ్యర్థుల ఎంపిక కోసం ఆదివారం ఎంపిక పరీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 4 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించారు. సూర్యాపేట ఎస్వీ డిగ్రీ కళాశాల, కోదాడ కేఆర్ఆర్ డిగ్రీ కళాశాల, హుజూర్‌నగర్ గ్రీన్‌వుడ్ పాఠశాల, తిరుమలగిరి జిల్లా పరిషత్ పాఠశాలలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి పరీక్ష నిర్వహించారు.సూర్యాపేట పట్టణంలోని ఎస్వీ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ కె.నరసింహ సందర్శించి, పరీక్ష సరళి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ ప్రత్యేక చొరవ, జిల్లా యంత్రాంగం, జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 45 రోజుల ఉచిత శిక్షణకు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్ల తెలిపారు. ముందస్తు రిజిస్ట్రేషన్ ద్వారా 1,600 మందికి పైగా అభ్యర్థులు నమోదు చేసుకోగా, ఈరోజు 1,220 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సమయాన్ని వృథా చేయకుండా ఇలాంటి శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొని పోలీసు ఉద్యోగాలతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే దిశగా కృషి చేయాలని ఎస్పీ ఆకాంక్షించారు.ఎస్పీ వెంట అదనపు కలెక్టర్ ట్రైనీ ఐఏఎస్ అనుషా, సూర్యాపేట డీఎస్పీ ప్రసన్న కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్సైలు, డిప్యూటీ ఎమ్మార్వో పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.





'పబ్బతి ఆంజనేయ స్వామి' సేవలో
జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మంతటి నారాయణ కుటుంబసభ్యులు

అచ్చంపేట,మన ప్రజాపక్షం:మద్దిమడుగులో వెలసిన పబ్బతి ఆంజనేయ స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకొని పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశామని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు అచ్చంపేట డివిజన్ విశ్రాంత ఉద్యోగుల సంఘం అసోసియేట్ అధ్యక్షులు మంతటి నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూల్ జిల్లా పదర మండలంలోని మద్దిమడుగు గ్రామంలో ఉన్న ఆలయము. పబ్బతి అంటే గిరిజనల భాషలో ప్రసన్న శాంతమూర్తి అని అర్థమన్నారు. అమ్రాబాద్ నుండి 45 కిలోమీటర్ల దూరంలో, ఇప్పలపల్లి నుండి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో నల్లమల్ల లోతట్టు అటవీ ప్రాంతంలో స్వామివారు స్వయంగా వెలిసినట్టు ప్రతితీఅన్నారు. నవంబర్ 30 నుంచి డిసెంబర్ 4 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. చైత్ర శుద్ధ పౌర్ణమి, కార్తీక మాసాలలో ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తుంటారు.ఈ ప్రాంతం హైదరాబాదుకు 156, మహబూబ్ నగర్ కు 147 అచ్చంపేటకు 70 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు.స్థలపురాణము – విశిష్టత:పూర్వము ఇక్కడ ఇద్దరు వ్యక్తులు బట్టలుతుకుంటూ ఉండేవారట.వారు బట్టలు పిండి పక్కనే ఉన్న బండమీద వేసేవారట. అలా వేసినప్పుడల్లా వేసేవారికి కాళ్ల నొప్పులు వగైరాలతో బాధపడేవారన్నారు. ఏమిటా అని ఒకసారి ఆ రాతిని పరిశీలనగా చూస్తే స్వామి ఆకారము కనబడిందట.వెంటనే తమ తప్పును తెలుసుకొని ఆ విగ్రహాన్ని నిలబెట్టి దీపారాధన చేసి వారికి తోచిన



పూజలు చేసి అక్కడ దొరికిన సామాగ్రితో నాలుగు గోడలు, పైన కప్పు వేశారన్నారు .సరిగా లేకపోవడం వల్ల ఆ గోడలు కప్పు కూలిన స్వామి విగ్రహం ఏమీ కాలేదట.ఇంకొక కథనం ప్రకారం: స్వామి స్వయంభు చెట్టు తొర్రలో నుంచి ఉద్భవించారన్నారు. నైరుతి దిక్కుగా కొంచెం వంగినట్లు ఉండే స్వామి విగ్రహాన్ని నిటారుగా నిలబెట్టాలని ఎంత ప్రయత్నం చేసినా కుదరలేదన్నారు.ఇప్పటికీ విగ్రహం కొంచెం ఒరిగినట్లే ఉంటుంది. ఈ స్వామి గురించి అందరికీ తెలిసింది శ్రీ మాన్సింగ్ బావుజి వల్ల ఈ ఆలయంలో ఆ బాబుజి ఫోటో కూడా ఉందన్నారు. ఆ బావూజీనే ఆలయం వెలుపల దూని ఏర్పాటు చేశారు. ఆ దూని అలాగే 365 రోజులు వెలుగుతూనే ఉంటుందన్నారు.ఇక్కడ ఉండే లంబాడీ వారికి చెంచులకి ఈ స్వామి మీద అపరిమితమైన భక్తి.పూజలు: చైత్ర శుద్ధ, పౌర్ణమి, కార్తీకమాసాలలో ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తూ ఉంటారన్నారు.ఈ సందర్భంగా హనుమాన్ గాయత్రి యజ్ఞము చేస్తారు.శని, మంగళ వారాలలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందన్నారు.బెల్లం గోధుమ రొట్టెలతో చేసిన ప్రత్యేక ప్రసాదాన్ని భక్తులు స్వామి వారికి నైవేద్యంగా సమర్పిస్తుంటారు.ఈ ప్రసాదాన్ని మలేజా అంటారన్నారు.దీక్ష: 1992లో గురుస్వామి జయరాం ఆధ్వర్యంలో 15 మంది భక్తులతో మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి దీక్ష ప్రారంభమై చుట్టుపక్కల జిల్లాల నుండి కూడా ప్రజలు ఇక్కడకు వచ్చి కార్తీకమాసంలో ఈ దీక్షలు స్వీకరిస్తారన్నారు.మాలలు ధరించి ఈ దీక్షను చేపట్టిన స్వాములు 41 రోజులు నియమ నిబంధనలతో ప్రతిరోజు తెల్లవారుజామున సాయంత్రం చన్నీటి స్నానం చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని చేపట్టి దీక్ష కాలము మద్దిమడుగులో జరిగే మహా యజ్ఞములో పాల్గొని దీక్షను విరమిస్తారన్నారు.ఇక్కడ భక్తులు పిలిస్తే పలికే దైవంగా మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి భక్తుల నీరాజనాలు అందుకుంటున్నాడు. ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వచ్చిపోయే భక్తుల సౌకర్యార్థము రాత్రి వేళల్లో బస చేయడానికి గదులు, టాయిలెట్స్, మంచినీటి వసతి మొదలుగువాటికీ నిధులు మంజురు చేయించి పనులు చేయించడం జరిగిందన్నారు. మన జిల్లా నుండే కాకుండ ఇతర జిల్లాలనుండి భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో మంతటి రమణమ్మ,మంతటి ఉదయ్ కుమార్,మంతటి మనీషా, అభియాంత్,రోషన్,హేమలతలు పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలలో ఘనంగా టర్మ్-1 ఎస్ ఎల్ సి కార్యక్రమం

జనగామ,మన ప్రజాపక్షం:జనగామ జిల్లా కేంద్రంలోని నారాయణ పాఠశాలలో విద్యార్థుల నేతృత్వ సమావేశం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఈ – చాంప్స్ ఆర్.ఎడి. స్వాతి, జోనల్ డి.జి.ఎం. రిజ్వానాఇమ్రాన్ హాజరైనారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుండే విద్యార్థులు వారి నేతృత్వంలోని సమావేశం నిర్వహించడం గొప్ప విషయం అని దీనిలో బాగంగా విద్యార్థులు తమ విద్యా పురోగతి మరియు పాఠశాలలో వారి అభ్యాసాల గురించి తల్లిదండ్రులకు చూపిస్తారని పిల్లలు తమ అభ్యాస అనుభవాన్ని మరియు పని నమూనాలను వ్యక్తీకరించడానికి, విద్యార్థుల మాట్లాడే నైపుణ్యాలను మరియు విశ్వాసాన్ని పెంపొందించడానికి ఒక వేదిక అని అన్నారు. అనంతరం డిజిఎం మాట్లాడుతూ విద్యార్థులు స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్ కోసం తమ తరగతి గదులను అలంకరించడానికి, తమ అభ్యాసాన్ని వివిధ మార్గాల్లో ప్రదర్శించడానికి ఇది ఒక అవకాశమని ఒక పిల్లవాడు నేర్చుకున్న వివిధ భావనల గురించి ప్రసంగాలు ఇవ్వడం నుండి, వారి ర తల్లిదండ్రులతో తమ పని పురోగతిని గురించి చర్చించడంలో పాల్గొనే అవకాశం స్వతంత్రంగా తరగతి గదిని బాధ్యత వహించడం మరియు చేసిన అభ్యాసం గురించి మాట్లాడటం మరియు ప్రతిబింబించడం ప్రశంసనీయమని, అది వారు చేసిన కృషి మరియు అంకితభావంనకు నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల



ప్రిన్సిపాల్ ఫర్హానా, ఈ –చాంప్స్ కోఆర్డినేటర్ శ్యామల ఏఓ చారి, ఈ–చాంప్స్ వైస్ ప్రిన్సిపల్ రేణుక తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

జనగామ బతుకమ్మ కుంటలో రక్షణ కరువు

విషసర్పం కలకలంతో సందర్శకుల భయాందోళన



జనగామ, మన ప్రజాపక్షం:జనగామ పట్టణ కేంద్రంలోని బతుకమ్మ కుంట ప్రాంగణంలో సందర్శకుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. తాజాగా బతుకమ్మ కుంట వద్ద ఉన్న చిల్డ్రన్స్ పార్క్‌లో ఒక విషసర్పం ప్రత్యక్షమవ్వడంతో అక్కడికి వచ్చిన సందర్శకులు, చిన్నారులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రమాదాన్ని గ్రహించిన స్థానికులు, సందర్శకులు చాకచక్యంగా వ్యవహరించి ఆ పామును పట్టుకుని చంపివేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందని వారు ఊపిరి పీల్చుకున్నారు.?రోజువారీగా ఇక్కడికి అనేకమంది ప్రజలు, పిల్లలు సమయం గడపడానికి వస్తున్నందున, కుంట పరిసరాల్లో పాముల సంచారం పట్ల స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సందర్శకులు బతుకమ్మ కుంట ప్రాంతానికి వచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, ప్రాంగణంలో తగినంత వెలుగు కొరకు వీధి లైట్లు ఏర్పాటు చేయాలని, పార్క్ చుట్టూ రక్షణ చర్యలు (ఫెన్సింగ్/భద్రత) చేపట్టాలని స్థానిక ప్రజలు, సందర్శకులు విజ్ఞప్తి చేస్తున్నారు.



500 మంది విద్యార్థులకు అర్ధరాత్రి జుట్టు కత్తిరింపు!

మహారాష్ట్రలోని ఓ ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో యాజమాన్యం వ్యవహరించిన తీరు తీవ్ర వివాదాస్పదంగా మారింది. చంద్రాపూర్ జిల్లా జంభుల్‌ఘాట్ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో సుమారు 500 మంది విద్యార్థుల జుట్టును అర్ధరాత్రి బలవంతంగా కత్తిరించిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ చర్యపై విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.విద్యార్థులకు చుండ్రు, తల దురద సమస్యలు ఉన్నాయనే కారణంతో పాఠశాల సిబ్బంది శనివారం మధ్యాహ్నం 3 గంటలకు జుట్టు కత్తిరించడం ప్రారంభించారు. అయితే, మధ్యలోనే ట్రిమ్మర్ ఛార్జింగ్ అయిపోవడంతో కొందరు విద్యార్థులకు సగం మాత్రమే జుట్టు కత్తిరించి వదిలేశారు. ఆ స్థితిలో ఉన్న విద్యార్థుల ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు.ఫొటోలు వైరల్ కావడంతో పరువు పోయిందని భావించిన సిబ్బంది, ఉన్నతాధికారుల ఆదేశాలతో శనివారం రాత్రి 11 గంటల నుంచి ఆదివారం తెల్లవారుజామున 4 గంటల వరకు మిగిలిన విద్యార్థులందరి జుట్టును కత్తిరించారు. విద్యార్థులు నిద్రపోతున్న సమయంలో ఈ చర్యకు పాల్పడటం గమనార్హం.ఈ ఘటనపై పాఠశాల సూపరింటెండెంట్ ప్రశాంత్ మేశ్రామ్ స్పందిస్తూ, విద్యార్థుల మేలు కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. "వర్షాకాలంలో వారి జుట్టు కత్తిరించలేదు. ఎండల కారణంగా బయట ఆడుకుని సరిగా తలస్నానం చేయకపోవడంతో చుండ్రు, ఇతర చర్మ సమస్యలు పెరిగాయి. అందుకే ఈ చర్య తీసుకున్నాం. సగం కత్తిరించిన ఫొటోలు వైరల్ కావడంతో వెంటనే పూర్తి చేయాలని ఆఫీస్ నుంచి ఆదేశాలు వచ్చాయి" అని ఆయన వివరించారు.అయితే, తల్లిదండ్రుల అనుమతి లేకుండా, అదీ అర్ధరాత్రి సమయంలో జుట్టు కత్తిరించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



గతంలో ఇదే పాఠశాలలో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన కూడా జరిగిందని, యాజమాన్యం తీరు మారడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై గిరిజన అభివృద్ధి శాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

మల్లన్న గండిలో విషాదం

నీట మునిగి సాఫ్ట్ వేర్ ఇంజనీర్ మృతి



జనగామ, మన ప్రజాపక్షం:
జనగామ జిల్లా నర్మెట్ట మండలం గండిరామారం మల్లన్న గండి రిజర్వాయర్ లో విషాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు నీటిలో పడి సాఫ్ట్ వేర్ ఇంజనీర్ మృతి చెందాడు. సికింద్రాబాద్ చిలకలగూడకు చెందిన పడాల కళ్యాణ్ కుమార్ (27) వరంగల్ లోని చారిత్రక ప్రదేశాలను సందర్శించి ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు మల్లన్న గండికి వచ్చాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు జారి నీటిలో మునిగిపోయాడు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు.



గంజాయి ముఠా అరెస్ట్...245 గ్రాముల గంజాయి, 2 బైకులు స్వాధీనం

జనగామ,మన ప్రజాపక్షం:
జనగామ ఎస్ హెచ్ ఓ ఉత్తర్వుల మేరకు, సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎం.భరత్ తన సిబ్బంది కరుణాకర్, కృష్ణ, శ్రీకాంత్, శివప్రసాద్, రమేష్, సాగర్, రాజేష్ మరియు శ్రీనులతో కలిసి బతుకమ్మ కుంట క్రాస్, సూర్యపేట రోడ్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల సమయంలో రెండు పల్సర్ బైక్‌లపై వస్తున్న ఐదుగురు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. ?వెంటనే అప్రమత్తమైన పోలీస్ సిబ్బంది వారిని చాకచక్యంగా పట్టుకుని విచారించారు. విచారణలో వారు భయపడుతూ తడబడుతూ సమాధానమిస్తూ తమ వద్ద గంజాయి ఉన్నట్లు అంగీకరించారు. పట్టుబడిన వారిని ఇట్టబోయిన ఉదయ్ కుమార్, స్వగ్రామం: కుందారం, ప్రస్తుతం హైదరాబాద్, పోతుగంటి సుధీర్ నివాసం: పెద్దమడూరు పంజాల శివకుమార్, నివాసం:హైదరాబాద్, నందన బోయిన సందీప్,నివాసం: కుందారం, తాండ్ర అభిషేక్ నివాసం: శామీర్‌పేట్ లుగా గుర్తించారు. ?వారి వద్ద నుండి 245 గ్రాముల గంజాయి, రెండు పల్సర్ బైకులు మరియు నాలుగు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై జనగామ సీఐ సత్యనారాయణ రెడ్డి కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



వెల్టూర్‌లో కోతుల బెడద.. వ్యక్తిపై దాడి

కోతుల దాడులతో గ్రామస్తుల్లో భయాందోళన...చర్యలు తీసుకోవాలని డిమాండ్

ఉప్పునుంతల,మన ప్రజాపక్షం:
ఉప్పునుంతల మండలం వెల్టూర్ గ్రామంలో కోతుల బెడద రోజు రోజుకూ పెరుగుతోంది.గ్రామంలోని బస్టాండ్ ఆవరణలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై దాదాపు 10 కోతులు ఒక్కసారిగా దాడి చేసి తీవ్రంగా కొరికి గాయపరిచాయి.చుట్టుపక్కల వారు కోతులను బెదిరించడంతో అవి అక్కడి నుంచి పారిపోయాయి. ఇప్పటికే గ్రామంలో పలువురిపై కోతులు దాడి చేసిన ఘటనలు చోటుచేసుకున్నాయని గ్రామస్తులు తెలిపారు.కోతులు ఇళ్లలోకి చొరబడి కూరగాయలు, ఇతర సామగ్రిని ఎత్తుకెళ్తుండటంతో ప్రజలు, ముఖ్యంగా చిన్నారులు బయటకు రావాలంటే భయపడుతున్న పరిస్థితి నెలకొంది. కోతుల దాడుల నుంచి గ్రామానికి విముక్తి కల్పించేందుకు గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, పాలకవర్గం వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మన ప్రజాపక్షం



చెడు జరుగుతుందని తెలిసినా.. ఏఐని ఆపలేం: శామ్ ఆల్ట్‌మన్

కృత్రిమ మేధ (ఏఐ) వల్ల కొన్ని చెడు పరిణామాలు, ప్రమాదాలు ఉన్నప్పటికీ, దాని ప్రయోజనాల కోసం ప్రపంచం వాటిని అంగీకరించాలని ఓపెన్‌ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'పొలిటికో డీకోడెడ్'కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఏఐ టెక్నాలజీ మానవాళికి మేలు చేయాలంటే, కొన్ని ప్రతికూలతలను ఎదుర్కోక తప్పదని ఆయన స్పష్టం చేశారు.ఏఐ సాంకేతికతను కేవలం ఒకే ల్యాబ్ నియంత్రణలో ఉంచి, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలనే వాదనను ఆయన తోసిపుచ్చారు. ఇది ఆమోదయోగ్యం కాని రాజీ అవుతుందని పేర్కొన్నారు. "ప్రజలకు ఈ టెక్నాలజీపై నియంత్రణ ఉండాలన్నా, దాని ప్రయోజనాలు అందాలన్నా.. కొన్ని చెడు విషయాలు జరగడాన్ని ప్రపంచం అంగీకరించాల్సి ఉంటుందని మేము నమ్ముతున్నాము" అని ఆల్ట్‌మన్ వివరించారు.హ్యాకింగ్, స్కామ్‌లు, ఇతర దుర్వినియోగాలకు భయపడి ఏఐ అభివృద్ధిని నిలిపివేయడం సరైన పద్ధతి కాదని ఆయన అన్నారు. ప్రజలు ఏఐతో చెడు కంటే ఎంతో ఎక్కువ మేలు చేస్తారని తాను విశ్వసిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో తమ సంస్థ ఓపెన్‌ఏఐ తేలికపాటి నియంత్రణను సమర్థిస్తుందని, ఈ విషయంలో తమకు, మరో ఏఐ సంస్థ ఆంత్రోపిక్‌కు భిన్నమైన దృక్పథాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. మొత్తంమీద, ఏఐ పురోగతికి కొన్ని రిస్కులను స్వీకరించడం తప్పనిసరి అనే అభిప్రాయాన్ని ఆల్ట్‌మన్ బలంగా వినిపించారు.



వీరేంద్ర సెహ్వాగ్ కొడుకుకు భారీ బాధ్యత.. ఢిల్లీ అండర్-19 కెప్టెన్‌గా ఆర్యవీర్

భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ కొడుకు ఆర్యవీర్ సెహ్వాగ్‌కు కీలక బాధ్యత దక్కింది. 2026-27 దేశవాళీ సీజన్‌లో జరిగే వినూ మంకడ్ ట్రోఫీ వన్డే టోర్నీకి ఢిల్లీ అండర్-19 జట్టు కెప్టెన్‌గా ఆర్యవీర్‌ను ఎంపిక చేశారు. 18 ఏళ్ల ఆర్యవీర్ ఇటీవలే భారత అండర్-19 జట్టులోకి అరంగేట్రం చేశాడు.ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరిగిన మూడు మ్యాచ్‌ల యూత్ వన్డే సిరీస్‌లో ఆర్యవీర్ 28, 47, 34 పరుగులు చేశాడు. ఈ సిరీస్‌ను భారత్ 3-0తో గెలిచింది. మూడు మ్యాచుల్లోనూ మంచి ఆరంభాలు ఇచ్చినప్పటికీ భారీ స్కోర్లు చేయలేకపోయానని ఆర్యవీర్ చెప్పాడు.భారత్ అండర్-19 జట్టుతో ఆడిన అనుభవం తనకు కీలక పాఠాలు నేర్పిందని తెలిపాడు. మ్యాచ్‌ను వివిధ దశలుగా విభజించుకుని ఆడాలని, భారీ పరుగులు చేయాలంటే ఎక్కువసేపు క్రీజులో నిలవాలని తెలుసుకున్నానని చెప్పాడు. క్రికెట్‌లో గుర్తింపు రావాలంటే పెద్ద స్కోర్లు చేయడం ముఖ్యమని పేర్కొన్నాడు.ఆర్యవీర్ గతంలోనే తన బ్యాటింగ్‌తో అందరి దృష్టినీ ఆకర్షించాడు. 2024లో కూచ్ బెహార్ ట్రోఫీలో మేఘాలయపై ఢిల్లీ తరఫున ఏకంగా 297 పరుగులు చేశాడు. ఈ ఏడాది ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో వెస్ట్ ఢిల్లీ లయన్స్ తరఫున కూడా ఆడాడు.తండ్రి వీరేంద్ర సెహ్వాగ్ భారత క్రికెట్‌లో పెద్ద పేరు కావడంతో తనపై సహజంగానే ఎక్కువ దృష్టి ఉంటుందని ఆర్యవీర్‌కు తెలుసు. అయితే తండ్రి పేరుతో తనకు ఎలాంటి ఒత్తిడి లేదని అతడు స్పష్టం చేశాడు. తన తండ్రి భారత్ కోసం చేసిన సేవలపై ఎంతో గర్వంగా ఉందని చెప్పాడు.ఇప్పుడు ఢిల్లీఅండర్-19 కెప్టెన్‌గా కొత్త బాధ్యత చేపట్టిన ఆర్యవీర్.. తన బ్యాటింగ్‌తో పాటు నాయకత్వంలోనూ సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాడు.



జానపద గిరిజన సంస్కృతి పరిరక్షణకు కృషి చేయాలి

గిరిజన సంస్కృతి పరిరక్షణకు కృషి చేయాలి

వనపర్తి,మన ప్రజాపక్షం:
వనపర్తి జిల్లా పాన్ గల్ మండల కేంద్రంలో ఏఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో తెలంగాణ గిరిజన సంఘం వనపర్తి జిల్లా 3 మూడవ మహాసభ విజయవంతంగా జరిగింది.ఈ సందర్భంగా బస్టాండ్ నుంచి ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా గిరిజనుల పోడు భూములకు పట్టాలి ఇవ్వాలని, ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, నిరుద్యోగ గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని అలాగే కరువులో ఉన్న గిరిజన రైతులను ఆదుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం తెలంగాణ గిరిజన సంఘం జెండాను అన్నారం గ్రామ సర్పంచ్ కృష్ణమ్మ ఆవిష్కరించారు. సభకు అధ్యక్షత రవి నాయక్,ఎం. బాల్య నాయక్ వహించారు.తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధర్మనాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. గిరిజనులకు రావలసిన నిధులు కేంద్ర ప్రభుత్వం విడుదల చేయడం లేదని వారు విమర్శించారు.విద్య, వైద్యం, అన్ని రంగాల్లో గిరిజనులు వెనుకబడి ఉన్నారని గుర్తు చేశారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో సుమారు వేల తాండాలకు మౌలిక వసతులు లేక గిరిజనులు అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. రాష్ట్రంలో ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చేందుకే కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అన్నారు. వివిజి రాంజీ చట్టాన్ని చేయాలని అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని కుదించడానికి ఈ ప్రభుత్వం పని చేస్తుందని వారు విమర్శించారు.రాష్ట్రంలో వేల ఎకరాలు ప్రభుత్వ అడవి భూములకు పట్టాలు ఇవ్వకుండా కాల రాస్తున్నారని, గిరిజన రైతులపై కేసులు పెట్టి అనేక ఇబ్బందులు గురి చేస్తున్నారని వారు విమర్శించారు. దేశంలో పది రాష్ట్రాలలో అటవీ భూములను పెట్టుబడిదారులకు అప్పజెప్పడం కోసం కృషి చేస్తున్నారని దానికి గిరిజనులు ఐక్యమై ఎదుర్కోవాలని వారు పిలుపునిచ్చారు. ఇప్పటికే రాష్ట్రంలో, జార్ఖండ్, ఛత్తీస్గడ్ గిరిజనులను గెంటేసే కార్యక్రమం చేస్తున్నారని అన్నారు.దేశంలో అనేక ప్రభుత్వ సంస్థల్లో ఉన్నటువంటి గిరిజన బ్యాక్లాగ్ పోస్టులను భర్తీ చేయకుండా నిలుపుదల చేస్తూ గిరిజన యువకులకు ఉపాధి అవకాశాలకు దెబ్బతిస్తున్నారని వారు అన్నారు.గిరిజనులకు కేటాయించిన బడ్జెట్లో నిధులు సరిగా ఇవ్వడం లేదన్నారు. తండాలకు రోడ్డు సౌకర్యం లేదు, బస్సులు నడవటం లేదని అన్నారు. నిరుపేదలకు అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి ఇండ్లు ఇవ్వాలని అన్నారు. తెలంగాణ గిరిజన సంఘం గిరిజన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని గిరిజనులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని అన్నారు. చేవెళ్ల డిక్లరేషన్ తప్పకుండా అమలు చేయకపోతే ఆందోళన పోరాటం నిర్వహిస్తామని వారు రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. తాండాలకు రెవెన్యూ గ్రామపంచాయతీ గుర్తించాలని సంఘం ప్రభుత్వాలకు డిమాండ్ చేసిందని వారు అన్నారు.వనపర్తి జిల్లా ప్రధానకార్యదర్శి ఎం. బాల్య నాయక్, జిల్లా మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో 7 ఎకరాల అడవి భూములకుహక్కుల చాలు ఇవ్వాలని అన్నారు.గిరిజన ప్రాథమిక పాఠశాల మూతపడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు రవి నాయక్, బాలు నాయక్, సోమ్లా నాయక్, అనిత, అన్నారం గ్రామ సర్పంచు కృష్ణమ్మ, హరినాయక్, అశోక్ నాయక్,శంకర్ నాయక్, సేవసంఘం వనపర్తి జిల్లా అధ్యక్షులు చంద్రనాయక్, గంపల్లి గ్రామ సర్పంచ్ గోపీ, గోపీనాయక్ నాగర్ కర్నూలు జిల్లా కార్యదర్శి అశోక్ నాయక్, ఉద్యోగ సంఘాల నాయకులు లక్ష్మణ్ నాయక్,శ్రీధర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సహకారంతోనే రైతుకు సమృద్ధి!

తెలంగాణలో శ్వేత విప్లవం
తూప్రాన్ డెయిరీ ప్లాంట్ నాంది
రూ.400 కోట్లతో అమూల్ అత్యాధునిక డెయిరీ ప్లాంట్
18 నెలల్లో నిర్మాణం పూర్తి
రైతులకు అదనపు ఆదాయం
మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు
కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి

మెదక్,మన ప్రజాపక్షం:
సహకార వ్యవస్థతోనే రైతుల ఆర్థిక అభ్యున్నతి సాధ్యమని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు తెలంగాణలో శ్వేత విప్లవం 2.0ను ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లో సుమారు రూ.400 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న అమూల్ అత్యాధునిక డెయిరీ ప్లాంట్‌కు భూమిపూజ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్లాంట్ కేవలం పారిశ్రామిక ప్రాజెక్టు మాత్రమే కాదని, తెలంగాణ పాడి రైతుల ఆర్థిక భవిష్యత్తుకు దిక్సూచిగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాబోయే 18 నెలల్లో ప్లాంట్ నిర్మాణం పూర్తిచేసి, స్థానిక మహిళలు, యువతకు ఉపాధి కల్పించడంతోపాటు పాడి రైతులకు అదనపు ఆదాయం సమకూర్చడమే లక్ష్యమన్నారు.రైతు ఉత్పత్తులకు విలువ జోడింపే లక్ష్యం. రైతులు ఉత్పత్తి చేసిన పాలకు సరైన మార్కెటింగ్ సదుపాయాలు లేకపోవడం, నిల్వ, ప్రాసెసింగ్, బ్రాండింగ్ సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో ఆశించిన ఆదాయం పొందలేకపోతున్నారని కిషన్‌రెడ్డి అన్నారు. తూప్రాన్ డెయిరీ ద్వారా పరిసర ప్రాంతాల రైతుల నుంచి పాలు సేకరించి ఇక్కడే ప్రాసెసింగ్ చేయడంతోపాటు పాలు, పెరుగు, మజ్జిగ, లస్సీ, పన్నీర్, ఐస్‌క్రీమ్, నెయ్యి వంటి ఉత్పత్తులను తయారు చేయనున్నట్లు తెలిపారు. దీనివల్ల పాలకు విలువ జోడింపుతో రైతులకు మెరుగైన ధర లభించడంతోపాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.వ్యవసాయం అంటే వరి, పత్తి, మిర్చి పంటలే కాకుండా భూమి ఉన్నా లేకపోయినా పశుపోషణ ద్వారా జీవనోపాధి పొందవచ్చన్నారు. చిన్న, సన్నకారు రైతులకు పాడి పరిశ్రమ అదనపు ఆదాయ వనరుగా మారుతుందని పేర్కొన్నారు.

సహకారంతో దళారుల దోపిడీకి అడ్డుకట్ట

రైతులంతా విడివిడిగా కాకుండా సహకార సంఘాలుగా ఏర్పడి సమష్టిగా పనిచేస్తే బలమైన ఆర్థిక శక్తిగా ఎదగవచ్చని కిషన్‌రెడ్డి అన్నారు. సహకార సంఘాల్లో రాజకీయ జోక్యం పెరగడంతో అవి నిర్వీర్యమయ్యాయని, వాటిని తిరిగి పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులే సహకార వ్యవస్థలో భాగస్వాములైతే దళారుల దోపిడీ, అవినీతి, రాజకీయ నాయకుల పెత్తనం తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. సహకార సంఘాల ద్వారా వచ్చే ఆదాయం గ్రామాల్లోనే వినియోగమై స్థానిక ఉపాధి, ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయని వివరించారు. సహకార ఉద్యమం కేవలం వ్యాపార నమూనా కాదని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే ప్రజా ఉద్యమమని పేర్కొన్నారు. గుజరాత్, మహారాష్ట్ర తరహాలో తెలంగాణలోనూ సహకార వ్యవస్థను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.అమూల్ విజయమే రైతుల విజయం అన్నారు.సహకార వ్యవస్థతో ఎలాంటి మార్పు సాధ్యమో సాబర్ డెయిరీ ప్రయాణమే నిదర్శనమని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 1964లో 19 సహకార సంఘాలతో రోజుకు 5,100 లీటర్ల పాల సేకరణతో ప్రారంభమైన సాబర్ డెయిరీ నేడు రోజుకు సుమారు 50 లక్షల లీటర్ల పాల ప్రాసెసింగ్ స్థాయికి చేరిందన్నారు. సుమారు 50 వేల మంది పాల ఉత్పత్తిదారులు ఇందులో భాగస్వాములుగా ఉన్నారని, 2025-26లో రూ.10,500 కోట్ల వార్షిక టర్నోవర్ సాధించిందని తెలిపారు.అమూల్ సహకార నెట్‌వర్క్ ద్వారా ఏటా సుమారు 25 లక్షల మెట్రిక్ టన్నుల పశువుల దాణాను రైతులకు అందిస్తున్నారని, పశువైద్య సేవలను రైతుల ఇళ్ల వద్దకే తీసుకెళు న్నారని వివరించారు. దేశ వ్యాప్తంగా సుమారు 30 లక్షల రిటైల్ ఔట్‌లెట్ల ద్వారా అమూల్ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని, 50కి పైగా దేశాలకు ఎగుమతి అవుతున్నాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అమూల్ సాధిస్తున్న గుర్తింపు భారత రైతుల విజయానికి నిదర్శనమన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకార శాఖను ఏర్పాటు చేసి సహకార రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యమిచ్చారని కిషన్‌రెడ్డి అన్నారు. శ్వేత విప్లవం 2.0లో భాగంగా 2029 నాటికి దేశవ్యాప్తంగా 75 వేల కొత్త పాడి సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.తెలంగాణలోనూ 1,525 కొత్త సహకార సంఘాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు.మహిళా సంఘాలు, పాడి రైతులు సహకార సంఘాలుగా ఏర్పడి పశుపోషణను విస్తరించాలని సూచించారు. మహిళా సంఘాలకు బ్యాంకుల



ద్వారా లభించే రూ.20 లక్షల వరకు రుణాలను సద్వినియోగం చేసుకొని పశువులను కొనుగోలు చేయడం, పాల ఉత్పత్తిని పెంచడం ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించాలని పిలుపునిచ్చారు. రైతు బలపడితే దేశం బలపడుతుంది ప్రపంచంలోనే అత్యధిక పాల ఉత్పత్తి చేస్తున్న దేశంగా భారత్ నిలిచిందని,ప్రపంచ పాల ఉత్పత్తిలో దాదాపు నాలుగో వంతు వాటా భారత్‌దేనని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. హరిత విప్లవం వ్యవసాయ రంగానికి, నీలి విప్లవం మత్స్య రంగానికి కొత్త శక్తినిచ్చినట్లే శ్వేత విప్లవం గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిందన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణంలో సహకార రంగం కీలక స్తంభంగా నిలవాలన్నదే లక్ష్యమని తెలిపారు.శ్వేత విప్లవం 2.0 ద్వారా రైతులకు అదనపు ఆదాయం, యువతకు ఉపాధి, మహిళలకు ఆర్థిక స్వావలంబన, గ్రామాలకు ఆర్థిక పరిపుష్టి చేకూరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ పాడి రైతులు సహకార ఉద్యమంలో భాగస్వాములై రాష్ట్రాన్ని శ్వేత విప్లవంలో ముందంజలో నిలపాలని పిలుపునిచ్చారు. రైతు బలపడితే గ్రామం బలపడుతుంది.గ్రామం బలపడితే తెలంగాణ, దేశం బలపడతాయి అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ఈ ప్లాంట్ వల్ల సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద నాణ్యమైన పాలు పాఠశాల విద్యార్థులకు అందచేయవచ్చని,రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల మందికి నాణ్యమైన పాలు బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని అందిస్తున్న వివరించారు.మెట్రో కార్యక్రమాల్లో కేంద్రం నుంచి శాఖ సహాయ సహకారాలు అందించాలని మంత్రి కిషన్ రెడ్డిని కోరారు. అమూల్ ప్లాంటును చెన్నూరులో ఏర్పాటు చేయాలని, చెన్నూరు పరిసర ప్రాంతాలతో



పాటు మహారాష్ట్రలో కూడా మంచి మార్కెటింగ్ ఉంటుందని తెలిపారు.ఐటి శాఖామంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల వెన్నెముక పాల డైరీ అన్నారు. రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం అనేక పరిశ్రమలను ప్రోత్సహిస్తుందన్నారు. అమూల్ ప్లాంట్ ద్వారా స్థానిక యువతకు ఉద్యోగాలతో పాటు గ్రామీణ రైతుల ఆర్థిక వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని తెలిపారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ విభిన్న సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపం మెదక్ జిల్లా అన్నారు.ఇటీవల వాతావరణ పరిస్థితులు మారుతున్న కాలానికి అనుగుణంగా మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో రైతన్నలకు కష్టం కావద్దని నేను పుట్టిన ఈ గడ్డలో రైతన్నలకు గల్లి నుంచి ఢిల్లీ దాకా రైతులకు ఏదో చేయాలని దృఢ సంకల్పంతో ఢిల్లీలో అమూల్ ప్రతినిధులను సంప్రదించామని తెలిపారు.ఎవరు ఆకలితో వస్తే వారి ఆకలి తీర్చే దే మెదక్ అని,మెతుకు సీమ అని అన్నారు.మెతుకు సీమలో రైతులు బాగుండాలని, రైతులకు అదనపు ఆదాయం చేకూరాలని అమూల్ కంపెనీ ప్రతినిధులను అమిత్ షాని కలిసిన సందర్భంలో అముల్ ఇండస్ట్రీ తూప్రాన్ లో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి,మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి గడ్డం వెంకటస్వామి,శ్రీధర్ బాబు గఇతర మంత్రుల సహాయ సహకారాలు ఎంతో తోడ్పాటు అందించారని తెలిపారు. వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను మెదక్ జిల్లాకు పరిచయం చేయాలని తూప్రాన్ లో అముల్ ఇండస్ట్రీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. వ్యవసాయం చేస్తున్న రైతన్న తన దినసరి ఖర్చులకు ఎవరి మీద ఆధారపడకుండా పాడి పరిశ్రమను నమ్ముకున్నట్లయితే తప్పనిసరిగా దినదినాభివృద్ధి చెందవచ్చు అని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సాబర్ డైరీ చైర్మన్ శ్యామ్ లాల్ జి పటేల్, కోపరేటివ్ కమిషనర్ రాహుల్ రాజ్, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, ప్రజా ప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

షమీ శకం ముగిసింది.. అతడిని తిరిగి జట్టులోకి తీసుకోవడంలో అర్థం లేదు: దినేశ్ కార్తీక్

టీమిండియా సీనియర్ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ షమీ అంతర్జాతీయ కెరీర్ దాదాపు ముగిసినట్లేనని భారత మాజీ క్రికెటర్, ప్రముఖ వ్యాఖ్యాత దినేశ్ కార్తీక్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. భారత జట్టు ఇప్పటికే షమీని దాటి ముందుకు వెళ్లిపోయిందని, ఇప్పుడు అతడిని తిరిగి జట్టులోకి తీసుకోవడంలో ఎటువంటి ప్రయోజనం లేదని స్పష్టం చేశాడు.2025లో చివరిసారిగా అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన మహమ్మద్ షమీ, అప్పటి నుంచి గాయాలు, ఫిట్‌నెస్ సమస్యలు, కొన్నిసార్లు ఇతర కారణాలతో జట్టుకు దూరంగా ఉంటున్నాడు. దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్నప్పటికీ, జాతీయ జట్టులో అతడి పునరాగమనంపై ఆశలు క్రమంగా సన్నగిల్లుతున్నాయి. ఇటీవల వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను భారత్ 2-1తో గెలిచినప్పటికీ, భారత బౌలర్లు తీవ్రంగా నిరాశపరిచారు. బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌లపై మన బౌలర్లు తేలిపోవడంతో,



అనుభవజ్ఞుడైన షమీని తిరిగి తీసుకురావాలనే చర్చ మొదలైంది.ఈ నేపథ్యంలో క్రిక్‌బజ్‌తో మాట్లాడుతూ దినేశ్ కార్తీక్ తన అభిప్రాయాన్ని పంచుకున్నాడు. "షమీని తిరిగి జట్టులోకి తీసుకోవాలా అని అడిగితే నా సమాధానం వద్దనే. భారత జట్టులో ఇప్పటికే చాలా మంది పేసర్లు ఉన్నారు. జట్టు షమీని దాటి ముందుకు సాగింది. ఇప్పుడు వెనక్కి వెళ్లడంలో అర్థం లేదు. షమీ దేశవాళీలో అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నప్పటికీ, అతడిని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదు" అని కార్తీక్ అన్నాడు. ప్రస్తుతం జట్టులో మహమ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిధ్ కృష్ణ వంటి పేసర్లు ఉండగా.. గుర్నూర్ బ్రార్, అకిబ్ నబీ, అన్షుల్ కంబోజ్ వంటి యువ బౌలర్లకు అవకాశాలు ఇస్తున్నారని గుర్తుచేశాడు.ఆసక్తికరంగా షమీ విషయంలో కఠినంగా వ్యవహరించిన కార్తీక్.. సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ విషయంలో మాత్రం భిన్నంగా స్పందించాడు. వారిద్దరూ జట్టులో కొనసాగాలని ఆకాంక్షించాడు. వచ్చే ఏడాది ప్రపంచకప్ తర్వాత వారు రిటైరైతే వన్డే క్రికెట్ భవిష్యత్తు అంధకారంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశాడు. "రోహిత్, కోహ్లీ ప్రపంచ క్రికెట్‌లోని అతిపెద్ద స్టార్లు. ప్రపంచ క్రికెట్‌కు కేంద్రంగా ఉన్న భారత్‌కు చెందిన ఈ ఇద్దరు మేటి ఆటగాళ్లు తప్పుకుంటే, అది కచ్చితంగా ఆటపై తీవ్ర ప్రభావం చూపుతుంది" అని కార్తీక్ వివరించాడు.

మైదానం బయట సైలెంట్.. గ్రౌండ్‌లో విధ్వంసం..

వైభవ్‌పై శ్రేయస్ అయ్యర్ కామెంట్స్ వైరల్

వైభవ్ సూర్యవంశీ.. భారత క్రికెట్‌లో ఇప్పుడు ఎక్కువగా వినిపిస్తున్న పేరు. 15 ఏళ్ల ఈ యువ ఆటగాడిపై టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ప్రశంసలు కురిపించాడు. మైదానం బయట చాలా ప్రశాంతంగా, సైలెంట్‌గా ఉండే వైభవ్.. గ్రౌండ్‌లోకి దిగితే మాత్రం విధ్వంసకర బ్యాటర్‌గా మారతాడని చెప్పాడు. ఇదే అతడిలో తనకు కనిపించే ఆసక్తికరమైన విషయం అని పేర్కొన్నాడు."వైభవ్‌తో నేను క్రికెట్ గురించి కాకుండా మైదానం బయట విషయాలపై ఎక్కువగా మాట్లాడుతుంటాను. అందరూ అతనితో క్రికెట్ గురించే మాట్లాడతారు. అతనిలో ఎంత ప్రతిభ ఉందో మనందరికీ తెలుసు. అందుకే అతని కుటుంబం, జీవనశైలి, క్రికెట్ కాకుండా అతడిని ఏ విషయాలు ఉత్సాహపరుస్తాయో తెలుసుకునేందుకు మాట్లాడుతుంటాను" అని అయ్యర్ చెప్పాడు."అతను చాలా సైలెంట్‌గా ఉంటాడు. కానీ మైదానంలో మాత్రం చాలా విధ్వంసకరంగా ఆడతాడు. ఇదే అతడిలో ఉన్న ఐరనీ. వైభవ్‌తో మాట్లాడటం చాలా సరదాగా ఉంటుంది. డ్రెస్సింగ్ రూమ్‌లో అతను ఉండటం కూడా బాగుంటుంది" అని అయ్యర్ అన్నాడు.ఐపీఎల్ 2025 వేలంలో రాజస్థాన్ రాయల్స్ వైభవ్‌ను రూ.1.1 కోట్లకు తీసుకున్నప్పటి నుంచి అతడిపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఐపీఎల్‌తో పాటు భారత అండర్-19, 'ఏ' జట్ల తరఫున కూడా వైభవ్ తన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు.అంతర్జాతీయ క్రికెట్‌లో ఇంగ్లండ్‌పై తొలి మూడు టీ20ల్లో 14, 13, 15 పరుగులు చేసిన వైభవ్.. జింబాబ్వేతో సిరీస్‌లో మాత్రం అదరగొట్టాడు. ఆ సిరీస్‌లో 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాడు.ప్రస్తుతం భారత జట్టులో రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ వంటి అనుభవజ్ఞులైన ఓపెనర్లు



ఉన్నారని అయ్యర్ చెప్పాడు. వారి స్థానంలో వైభవ్ ఆడటం లేదన్న మాత్రాన అతని ప్రతిభపై నమ్మకం లేదని భావించకూడదని స్పష్టం చేశాడు. "అతను 15 మంది సభ్యుల జట్టులోనే ఉన్నాడు. అతడికి అవకాశం వచ్చే సమయం తప్పకుండా వస్తుంది. ఆ రోజు భారత క్రికెట్‌లో వైభవ్ ఆధిపత్యం చూపిస్తాడు" అని అయ్యర్ ధీమా వ్యక్తం చేశాడు.2026 ఆసియా క్రీడల్లో స్వర్ణం సాధించిన భారత జట్టులోనూ వైభవ్ సభ్యుడిగా ఉన్నాడు. ఫైనల్లో పాకిస్థాన్‌ను 19 పరుగుల తేడాతో ఓడించి భారత్ టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఇప్పుడు వెస్టిండీస్‌తో ఐదు టీ20ల సిరీస్‌లోనూ భారత జట్టు అదే జోరును కొనసాగించాలని చూస్తోంది.



ఏఐ కాదు ఎస్ఐ.. ట్రంప్ బాటలో ఎలాన్ మస్క్.. కంపెనీ పేరు మార్పునకు సై!

ప్రపంచవ్యాప్తంగా అందరి నోళ్లలో నానుతున్న పదం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ). మన దైనందిన జీవితంలో భాగమైపోయిన ఈ సాంకేతికత పేరును మార్చాలంటూ టెస్లా, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ కొత్త ప్రతిపాదన తీసుకొచ్చారు. ఇకపై ఏఐకి బదులుగా ఎస్ఐ (సూపర్ ఇంటెలిజెన్స్) వాడాలని ఆయన సూచించారు. అంతేకాకుండా తన 'స్పేస్‌ఎక్స్ఏఐ' కంపెనీ పేరును 'స్పేస్‌ఎక్స్ఎస్ఐ' గా మార్చేందుకు కూడా అంగీకారం తెలిపారు.సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో "ఇక ఏఐ వద్దు" అంటూ మస్క్ ఒక చిన్న పోస్ట్ చేశారు. ఏఐ కన్నా ఎస్ఐ అనే పదం బాగుంటుందని అభిప్రాయపడ్డారు. మస్క్ పోస్ట్‌పై స్పందించిన ఒక యూజర్.. "అయితే స్పేస్‌ఎక్స్ఏఐ పేరును స్పేస్‌ఎక్స్ఎస్ఐగా మారుస్తారా?" అని ప్రశ్నించారు. దీనికి మస్క్ సానుకూలంగా స్పందిస్తూ "తప్పకుండా మారుస్తాం" అని బదులిచ్చారు.అయితే, మస్క్ ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జారీ చేసిన ఆదేశాలు ఉన్నాయి. సెప్టెంబర్ 30న ట్రంప్ ఒక కీలక కార్యనిర్వాహక ఉత్తర్వు (ఎగ్జిక్యూటివ్ ఆర్డర్) జారీ చేశారు. దాని ప్రకారం అమెరికా ప్రభుత్వ అధికారిక కమ్యూనికేషన్లలో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' పదానికి బదులుగా 'సూపర్ ఇంటెలిజెన్స్' అనే పదాన్నే వాడాలని స్పష్టం చేశారు.ప్రస్తుతం అభివృద్ధి చేస్తున్న టెక్నాలజీల అసలైన సామర్థ్యాలను 'సూపర్ ఇంటెలిజెన్స్' అనే పదమే సరిగ్గా ప్రతిబింబిస్తుందని ఆ ఉత్తర్వులకు సంబంధించిన ఫ్యాక్ట్‌షీట్‌లో ప్రభుత్వం పేర్కొంది. ఇటీవలే ప్రముఖ ఏఐ కంపెనీల అధినేతలతో జరిగిన సమావేశంలో కూడా ఈ కొత్త పేరును వాడాలని ట్రంప్ వారిని కోరారు. ట్రంప్ ఆదేశాల తర్వాతే మస్క్ ఈ దిశగా స్పందించడం గమనార్హం.మస్క్ ప్రకటన సోషల్ మీడియాలో వైరల్ అయింది. నెటిజన్ల నుంచి దీనిపై మిశ్రమ స్పందనలు వస్తున్నాయి. "ఏఐకి మంచి రోజులు ముగిశాయి" అని ఒకరు కామెంట్ చేయగా, "ఇది ఎప్పటికీ ఏఐనే, పేరు మార్చినంత మాత్రాన ఏమీ మారదు" అని మరో యూజర్ అభిప్రాయపడ్డారు. మరికొందరు "ఇక స్పేస్‌ఎక్స్ఏఐ పేరును స్పేస్‌ఎక్స్ఎస్ఐగా మార్చాల్సిన సమయం వచ్చింది" అంటూ మస్క్‌కు మద్దతు తెలిపారు. మొత్తం మీద టెక్నాలజీ రంగంలో ఈ కొత్త పేరు మార్పు వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది



సీఈసీ రాజీనామా డిమాండ్ల వేళ.. ఈసీ కీలక అడుగు!

ఎన్నికల సన్నాహకాలపై ఐదు రాష్ట్రాలకు ప్రత్యేక బృందాలు..
గోవా నుంచి క్షేత్రస్థాయి పర్యటనలు

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 04:

కేంద్ర ఎన్నికల సంఘంలో ఎస్ఐఆర్ అంశంపై వివాదాలు, సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామాకు డిమాండ్లు, ఎన్నికల కమిషనర్ల నియామకంపై సుప్రీంకోర్టు విచారణ కొనసాగుతున్న సమయంలో ఈసీ కీలక నిర్ణయం తీసుకుంది. 2027లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల సన్నాహకాలను పరిశీలించేందుకు డిప్యూటీ ఎన్నికల కమిషనర్ల నేతృత్వంలో ప్రత్యేక బృందాలను రంగంలోకి దించుతోంది.వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న గోవా, మణిపూర్, పంజాబ్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించనున్నాయి. ఈ వారం గోవాలో పర్యటన ప్రారంభం కానుండగా, వచ్చే వారం ఉత్తరాఖండ్‌లో బృందం పర్యటించనుంది. అనంతరం పంజాబ్, మణిపూర్ రాష్ట్రాల్లో పర్యటనలు కొనసాగనున్నాయి. ఉత్తరప్రదేశ్ పర్యటన షెడ్యూల్ ఇంకా ఖరారు కాలేదు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు, క్షేత్రస్థాయి పరిస్థితులను ఈ పర్యటనల్లో పరిశీలించనున్నారు.ఈ ఐదు రాష్ట్రాల్లో కలిపి 690 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఇందులో ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే 403 స్థానాలు ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ పదవీకాలం 2027 మే 22తో ముగియనుండగా, మిగిలిన నాలుగు రాష్ట్రాల అసెంబ్లీల పదవీకాలం 2027 మార్చిలో ముగియనుంది. పదవీకాలం ముగియడానికి ఆరు నెలల ముందే ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉండటంతో ఈసీ ఇప్పటి నుంచే సన్నాహకాలను ముమ్మరం చేస్తోంది. మరోవైపు సీఈసీ రాజీనామా డిమాండ్ల నేపథ్యంలో ఈసీ తీసుకుంటున్న చర్యలు రాజకీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



పాకిస్థాన్ లో ఘోరమైన పరిస్థితి.. ఆకలి కేకలతో అల్లాడుతున్న దేశం

పాకిస్థాన్‌లో పేదరికం పీక్స్..!
తిండికీ డబ్బుల్లేక.. ఫుట్‌పాత్‌లపైనే రాత్రి బస!
ఆకలితో అలమటిస్తున్న దినసరి కూలీలు

అక్టోబర్ 04:

ఆర్థిక సంక్షోభం, పెరుగుతున్న ధరల ప్రభావంతో పాకిస్థాన్‌లో సామాన్యుల జీవనం కష్టాల్లో పడిందని కథనం పేర్కొంది. రావల్పిండిలో పరిస్థితులు మరింత దారుణంగా ఉన్నాయని, పని కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి వస్తున్న దినసరి కూలీల్లో పలువురు అద్దె గది తీసుకునే స్థోమత లేక ఫుట్‌పాత్‌లు, మెట్రో బస్ మార్గాలు, దుకాణాల ముందు ఖాళీ ప్రదేశాల్లో రాత్రులు గడుపుతున్నారని తెలిపింది. రోజంతా కష్టపడినా వచ్చే ఆదాయం తిండి, వసతి ఖర్చులకు సరిపోకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది.ఖైబర్ పఖ్తుంఖ్వా, పంజాబ్‌లోని గ్రామీణ ప్రాంతాల నుంచి వేలాది మంది కార్మికులు రావల్పిండికి వచ్చి సరుకుల లోడింగ్, అన్‌లోడింగ్, రవాణా తదితర దినసరి పనులు చేస్తున్నట్లు కథనం తెలిపింది. రోజుకు సుమారు రూ.700 నుంచి రూ.1,000 వరకు మాత్రమే సంపాదించే పలువురు కార్మికులు మురీ రోడ్, చాందినీ చౌక్, పిర్వాధాయ్ బస్ స్టాండ్, లియాఖత్ బాగ్ ప్రాంతాల్లోనే రాత్రి గడుపుతున్నారని పేర్కొంది. వర్షం, చలి వంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ మెట్రో బస్ కాంక్రీట్ పిల్లర్లు, దుకాణాల రేకుల షెడ్లు, నిలిపి ఉంచిన లారీలు, నెట్టే బండ్లను ఆశ్రయిస్తున్నారని తెలిపింది.సొంతంగా భోజనం కొనుగోలు చేయలేని పరిస్థితిలో కొందరు కార్మికులు స్వచ్ఛంద సంస్థలు, హోటల్ యజమానులు అందించే ఉచిత భోజనాలపై ఆధారపడుతున్నారని కథనం పేర్కొంది. ఉచిత భోజన కేంద్రాల వద్ద దీర్ఘ క్యూలు కనిపిస్తున్నాయని, చిన్నారులతో ఉన్న పేద మహిళలు కూడా అక్కడికి వస్తున్నారని తెలిపింది. రావల్పిండిలో కనిపిస్తున్న ఈ పరిస్థితులు పాకిస్థాన్‌లో ఉపాధి, ఆదాయం, ఆహారం, నివాస భద్రత వంటి సమస్యలపై మరోసారి చర్చకు దారితీస్తున్నాయి.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆసరా

రెండు కుటుంబాలకు రూ.10 వేల ఆర్థిక సాయం

గోపాల్ పేట, అక్టోబర్ 04

గోపాల్ పేట గ్రామానికి చెందిన బాధిత కుటుంబాలకు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆర్థిక సాయం అందించారు. స్థానిక నాయకులు, ఉమ్మడి గోపాల్ పేట మండల వ్యవసాయ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మందా సత్యశీలారెడ్డి బాధిత కుటుంబాల పరిస్థితిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి సాయం అందించినట్లు తెలిపారు.గోపాల్ పేట గ్రామానికి చెందిన కావలి బంగారి (72) కుటుంబానికి రూ.5,000, సొడమోని పెంటమ్మ (56) కుటుంబానికి రూ.5,000 చొప్పున మొత్తం రూ.10,000 ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు బాధిత కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబ సభ్యులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు.బాధిత కుటుంబాలను పరామర్శించిన వారిలో రాష్ట్ర ఎస్సీ డిపార్ట్‌మెంట్ జనరల్ సెక్రటరీ కొంకి వెంకటేష్, వనపర్తి జిల్లా ఎస్సీ సెల్ ఇన్‌చార్జ్ శివన్న, మాజీ ఎంపీపీ శేఖర్, కేతేపల్లి వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ మేస్త్రి బాలయ్య, వార్డు సభ్యులు పోడవు సురేష్, నాగరాజు, గొల్లపులయ్య, కృష్ణయ్య యాదవ్, బత్తుల శ్రీశైలం, వనపర్తి జిల్లా మీడియా కమ్యూనికేషన్ అండ్ పబ్లిసిటీ కోఆర్డినేటర్ మునిగళ్ల ప్రవీణ్ కుమార్ తదితరులు ఉన్నారు.



ప్రజలు దాహంతో ఉంటే.. మున్సిపల్ ట్యాంకర్ వ్యక్తిగత పనులకా?

మాజీ వైస్ చైర్మన్ ఇంటి పనికి మున్సిపల్ నీటి ట్యాంకర్ వినియోగంపై విచారణ జరపాలి.
బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తిని మధు

వనపర్తి, అక్టోబర్ 04):

వనపర్తి పట్టణంలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న సమయంలో మున్సిపల్ నీటి ట్యాంకర్‌ను మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బలరాం కృష్ణ వ్యక్తిగత పనులకు వినియోగించుకున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని బీజేపీ వనపర్తి పట్టణ అధ్యక్షుడు బత్తిని మధు డిమాండ్ చేశారు. ప్రజలకు తాగునీరు అందించాల్సిన మున్సిపల్ వనరులను వ్యక్తిగత అవసరాలకు ఎలా వినియోగించారో అధికారులు స్పష్టం చేయాలని కోరారు.వనపర్తి మున్సిపాలిటీలో 33 వార్డులు, 15,891 గృహ తాగునీటి కనెక్షన్లు, 125 ప్రజా కుళాయిలు, 31 రిజర్వాయర్లు ఉన్నాయని బత్తిని మధు తెలిపారు. ఇవన్నీ ప్రజా అవసరాల కోసమే వినియోగించాల్సిన వనరులని పేర్కొన్నారు. ఒకవైపు ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుంటే, మున్సిపల్ వనరులను వ్యక్తిగత పనులకు వినియోగించారనే ఆరోపణలు రావడం ఆందోళనకరమన్నారు.అధికార పార్టీకి చెందిన వ్యక్తి కావడం వల్లే అధికారులు పట్టించుకోవడం లేదా? నిబంధనల ప్రకారం మున్సిపల్ ట్యాంకర్ వినియోగానికి అనుమతి ఇచ్చారా? అని బత్తిని మధు ప్రశ్నించారు. మున్సిపల్ నీటి వినియోగానికి సంబంధించిన అనుమతులు, రికార్డులు, ట్యాంకర్ వినియోగ వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.ఆరోపణలు వాస్తవమని విచారణలో తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని బత్తిని మధు కోరారు. ప్రజలకు అందాల్సిన మున్సిపల్ వనరులు ప్రజా అవసరాలకే వినియోగించేలా అధికారులు పర్యవేక్షణ పెంచాలని డిమాండ్ చేశారు.




ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం

300 మందికి కంటి పరీక్షలు.. 64 మంది శస్త్రచికిత్సకు ఎంపిక

గోపాల్ పేట, అక్టోబర్ 04 :

మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని గోపాల్ పేట సర్పంచ్ కర్రోళ్ల స్వప్న భాస్కర్ ఆధ్వర్యంలో, శంకర కంటి ఆసుపత్రి సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. గోపాల్ పేట గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో మండల వ్యాప్తంగా 300 మందికి పైగా ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు.కంటి పరీక్షల్లో 64 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించి, తదుపరి ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచిత వైద్య సేవలు అందించడం సంతోషంగా ఉందని సర్పంచ్ స్వప్న భాస్కర్ తెలిపారు. శిబిరానికి సహకరించిన శంకర కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బుద్దారం సర్పంచ్ డాక్టర్ శేఖర్, సాకలపల్లి సర్పంచ్ శేషిరెడ్డి, జింకలబీడు తండా సర్పంచ్ హనుమంతు నాయక్, మంద తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ కాశీనాథ్, గుండ్రాతి రాజేష్ గౌడ్, సాకలి బుచ్చన్న, సత్యనారాయణ, ఉప సర్పంచ్ కేశవులు, మాజీ ఉప సర్పంచ్ వై. శివ, వార్డు సభ్యులు బాలచంద్రయ్య, పెద్ద వెంకన్న, దాసరి రాజు, యాపచెట్టు భాగ్యమ్మ, వై. దేవన్న, కొంకలి రామస్వామి, ఓంకార్, జహంగీర్, శనగల వెంకటయ్య, కొండయ్య, గాజుల శ్రీనివాసులు, వెంకటస్వామి, మూర్తి, దశరథం, వడ్డేమాన్ రవి, బొగ్గుల శివ, డి. నాగరాజు, మహేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.





సమగ్ర భూ రీ–సర్వే పనులను కట్టుదిట్టంగా నిర్వహించాలి

పారదర్శకతకు పెద్దపీట వేయాలి.. అదనపు కలెక్టర్ టి. వినోద్ కుమార్

గోపాల్ పేట, అక్టోబర్ 04

వనపర్తి జిల్లాలో చేపడుతున్న సమగ్ర భూ రీ–సర్వే పనులను నిబంధనల ప్రకారం, పారదర్శకంగా, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఆదివారం గోపాల్ పేట మండలం చెన్నూరు గ్రామంలో కొనసాగుతున్న భూ రీ–సర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే ప్రక్రియ కొనసాగుతున్న తీరును పరిశీలించడంతో పాటు సంబంధిత రికార్డులను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా గ్రామంలోని రైతులు, భూ యజమానులతో అదనపు కలెక్టర్ మాట్లాడి ప్రస్తుతం సాగు చేస్తున్న పంటలు, పంట చేతికి వచ్చే సమయం, సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రీ–సర్వే ప్రక్రియను సమన్వయంతో నిర్వహించాలని సూచించారు.

కో–రిలేషన్ రిజిస్టర్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి

రీ–సర్వేలో కీలకమైన కో–రిలేషన్ రిజిస్టర్‌ను పక్కాగా, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సర్వేకు సంబంధించిన సమాచారాన్ని రైతులు, భూ యజమానులకు ముందుగానే నోటీసుల ద్వారా తెలియజేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి భూ రీ–సర్వే లక్ష్యాలు, ప్రాధాన్యత, ప్రక్రియపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు.సర్వే సమయంలో భూముల సరిహద్దులు, సర్వే రాళ్ల గుర్తింపులో స్పష్టత ఉండేలా నిబంధనల ప్రకారం వివిధ రకాల సర్వే రాళ్లకు రంగులు వేయాలని సూచించారు. అధికారులు, సర్వే సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు.

12 మండలాల్లో ప్రారంభమైన రీ–సర్వే

వనపర్తి జిల్లాలోని మొత్తం 15 మండలాలకు గాను ఇప్పటికే 12 మండలాల్లో భూ రీ–సర్వే పనులు ప్రారంభమైనట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. మిగిలిన రేవల్లి, ఆత్మకూర్, చిన్నంబావి మండలాల్లో మరో రెండు, మూడు రోజుల్లో పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. తొలి విడతలో జిల్లాలోని 70 గ్రామాల్లో భూ రీ–సర్వే నిర్వహించేందుకు లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ఇప్పటివరకు పెబ్బేరు మండలం బూర్దిపాడు గ్రామంలో రీ–సర్వే ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని వెల్లడించారు.ఈ పర్యటనలో సంబంధిత మండల సర్వే అధికారులు, రెవెన్యూ సిబ్బంది, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.



అది లైంగిక దాడితో సమానం

'చుట్టమల్లే' పాట మార్ఫింగ్ పై తొలిసారిగా స్పందించిన జాన్వీ కపూర్



జూనియర్ ఎన్టీఆర్, జాన్వీ కపూర్ జంటగా నటించిన 'దేవర: పార్ట్ 1' చిత్రంలోని 'చుట్టమల్లె' పాట వీడియోను ఏఐ టెక్నాలజీతో మార్ఫింగ్ చేసి, అసభ్యకరంగా మార్చి సర్క్యులేట్ చేయడంపై తీవ్ర దుమారం రేగుతోంది. ఈ నీచమైన చర్యపై కథానాయిక జాన్వీ కపూర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇది లైంగిక దాడితో సమానమని ఆమె ఘాటుగా స్పందించారు.ఈ విషయంపై తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఆమె స్పందిస్తూ, "మహిళలను అభ్యంతరకరంగా చూపించడానికి, వారి అనుమతి లేకుండా కల్పిత కంటెంట్‌ను వ్యాప్తి చేయడానికి టెక్నాలజీని నేరపూరితంగా దుర్వినియోగం చేయడం తీవ్రమైన ఆవేదన కలిగిస్తోంది. ఇది లైంగిక దాడికి పాల్పడటంతో సమానం. నా పరిశ్రమలోని దాదాపు ప్రతి మహిళ ఇలాంటివి ఎదుర్కొంది. ఇప్పుడు ప్రతిచోటా మహిళలు దీనికి గురవుతున్నారు" అని పేర్కొన్నారు. సమ్మతి ప్రాముఖ్యతను నొక్కిచెబుతూ, ఎవరైనా ఎన్నిసార్లు సమ్మతి తెలిపినా, ఒక్కసారి 'వద్దు' అని చెబితే దానిని గౌరవించాలని ఆమె స్పష్టం చేశారు. తనకు మద్దతుగా నిలిచిన ఎన్టీఆర్‌తో పాటు ఇతర ప్రముఖులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.ఈ వివాదంపై మొదట స్పందించింది జూ.ఎన్టీఆర్. అక్టోబర్ 3న ఆయన ఎక్స్ వేదికగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇది అసహ్యకరమైన, రోత పుట్టించే, సిగ్గుమాలిన చర్య. ఇలాంటి పనుల కోసం ఏఐను ఉపయోగించడం మాటలకు అందని సిగ్గుచేటు" అని మండిపడ్డారు. ఈ వీడియోను రూపొందించిన, షేర్ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరూ ఈ వీడియోను చూడవద్దని, షేర్ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. 'మాతృదేవోభవ' అంటూ స్త్రీలను గౌరవించే సంస్కృతిని గుర్తుచేస్తూ, ఏఐ దుర్వినియోగంపై ప్రభుత్వం కఠినమైన నిబంధనలు తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.ఎన్టీఆర్, జాన్వీలకు సినీ పరిశ్రమ నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది. నటుడు విజయ్ దేవరకొండ దీన్ని "డిజిటల్ లైంగిక దాడి"గా అభివర్ణించారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు పడాలని డిమాండ్ చేశారు. చిరంజీవి వంటి సీనియర్ నటులు కూడా వారికి మద్దతు తెలిపినట్లు సమాచారం. 2024లో విడుదలైన 'దేవర' చిత్రంలోని 'చుట్టమల్లె' పాట ఎంతగా పాపులర్ అయ్యిందో తెలిసిందే. అలాంటి ఒక రొమాంటిక్ పాటను అశ్లీలంగా మార్ఫింగ్ చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.అనుమతి లేకుండా మహిళలను లక్ష్యంగా చేసుకుని, వారి ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకు ఏఐ టెక్నాలజీని దుర్వినియోగం చేస్తున్న తీరుపై ఈ సంఘటన మరోసారి తీవ్ర ఆందోళనలను రేకెత్తించింది. ఈ డీప్‌ఫేక్ సంస్కృతిపై కఠినమైన చట్టాలు, నియంత్రణ అవసరమనే వాదన బలంగా వినిపిస్తోంది.

బహ్రెయిన్ గ్రాండ్ ప్రి విన్నర్ వెర్‌స్టాపెన్



సెపాంగ్ (మలేషియా) : రెడ్‌బుల్ స్టార్ డ్రైవర్, నాలుగు సార్లు ప్రపంచ చాంపియన్ మాక్స్ వెర్‌స్టాపెన్ 2026 ఫార్ములా వన్ సీజన్‌లో బోణీ కొట్టాడు. సెపాంగ్ సర్క్యూట్‌లో ఆదివారం జరిగిన బహ్రెయిన్ గ్రాండ్ ప్రిలో సంచలన విజయం సాధించాడు. గంటా 47 నిమిషాల 14.808 సెకండ్లలో టాప్ ప్లేస్ సాధించాడు.రేసు ఆఖరి ఘట్టంలో మెర్సిడెస్ డ్రైవర్ జార్జ్ రస్సెల్ సాంకేతిక లోపంతో వైదొలగడంతో ఆ జట్టుకే చెంది న కిమీ ఆంటోనెల్లి (ం2.307 సె) రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఫెరారీ దిగ్గజం లూయిస్ హామిల్టన్ (ం4.919 సె)మూడో స్థానంలో నిలిచాడు.

ఖతార్‌లో కలుద్దాం
అట్టహాసంగా ముగిసిన ఆసియా గేమ్స్

నగోయా (జపాన్) : రెండు వారాల పాటు వేలాది మంది ఆసియా క్రీడాకారుల హోరాహోరీ పోరాటాలకు వేదికగా నిలిచిన 20వ ఆసియా గేమ్స్‌కు తెరపడింది. నగోయాలోని మిజుహో పార్క్ అథ్లెటిక్ స్టేడియంలో ఆదివారం సాయంత్రం 90 నిమిషాల పాటు సాగిన ముగింపు వేడుకలు కనువిందు చేశాయి. ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా (ఓసీఏ) అధ్యక్షుడు షేక్ జోఆన్ బిన్ హమద్ అల్ థానీ క్రీడలు ముగిసినట్లు అధికారికంగా ప్రకటించారు. అనంతరం ఓసీఏ పతాకాన్ని 2030 ఎడిషన్‌కు ఆతిథ్యం ఇచ్చే ఖతార్‌లోని దోహా నగర ప్రతినిధులకు అధికారికంగా అందజేశారు. ఖతార్ హైజంప్ దిగ్గజం ముతాజ్ బార్షిమ్ నుంచి ఈక్వెస్ట్రియన్ రైడర్ జాసిమ్ అల్ కువారీ ఆసియాడ్ పతాకాన్ని స్వీకరించాడు.ముగింపు వేడుకలకు ప్రధాన ఆకర్షణగా నిలిచిన అథ్లెట్ల పరేడ్‌లో భారత ట్రాప్ షూటర్ నీరూ ధండా త్రివర్ణ పతాకాన్ని చేతిలో పట్టుకుని ముందు నడిచింది. తెలుపు, నీలం రంగు దుస్తులు ధరించిన సుమారు 30 మంది భారత అథ్లెట్లు, అధికారులు ఈ మార్చ్‌పాస్ట్‌లో పాల్గొన్నారు. 'వన్ ఆసియా' అనే ఇతివృత్తంతో రూపొందించిన వేదికపై జపాన్ సాంప్రదాయ 'బోన్-ఒడోరి' నృత్యాలు, 'మత్సుకెన్ సాంబా2' ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఆరంభ లోపాలను దాటి

ఈసారి ఆసియా క్రీడల నిర్వహణలో జపాన్ భిన్నమైన వ్యూహాన్ని అనుసరించింది. భారీ ఖర్చులతో ప్రత్యేకంగా అథ్లెట్స్ విలేజ్‌లు, కొత్త స్టేడియంలు నిర్మించకుండా.. అందుబాటులో ఉన్న వేదికలు, తాత్కాలిక నిర్మాణాలతో తక్కువ ఖర్చుతో క్రీడలను నిర్వహించింది. ఆరంభంలో హోటల్ వసతి సమస్యలు, రవాణా ఆలస్యం, అక్రిడిటేషన్ గందరగోళం ఎదురైనప్పటికీ.. నిర్వాహకులు త్వరగానే లోపాలను సరిదిద్ది పోటీలను విజయవంతంగా ముగించారు. 45 దేశాల నుంచి దాదాపు 11 వేల మంది అథ్లెట్లు పాల్గొన్న పోటీల్లో 54 ప్రపంచ రికార్డులు, 89 ఆసియా రికార్డులు బ్రేక్ అవడంతో ఈ ఆసియాడ్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది.



SPORTS

ఈ మెరుపులు సరిపోతాయా..
ఆసియాడ్‌లో భారత్‌కు మళ్లీ నాలుగో స్థానం

ఆసియా ఖండాన్ని హోరెత్తించిన ప్రతిష్టాత్మక ఆసియా గేమ్స్ హంగామా ముగిసింది. భారత్ మరోసారి టాప్4లో నిలిచింది. 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలతో మొత్తం 85 పతకాలు గెలిచింది. చివరి రెండు రోజుల్లో ఏకంగా 11 స్వర్ణాలు సాధించడంతో నాలుగో స్థానం ఖరారైంది. ఇంత వరకు బాగానే ఉంది కానీ గత ఆసియాడ్‌తో పోల్చితే ఈసారి మన దేశం వెనుకబడింది. హాంగ్జౌలో 2023లో జరిగిన గత పోటీల్లో 28 స్వర్ణాలు సహా 106 పతకాలు సాధించిన భారత్.. ఈసారి 21 స్వర్ణాలకే పరిమితమైంది. మొత్తంగా 21 పతకాలు, 7 స్వర్ణాలు తగ్గాయి. అదే సమయంలో చైనా మరోసారి తన ఆధిపత్యాన్ని చాటింది. 169 గోల్డ్ సహా మొత్తం 341 మెడల్స్‌తో మళ్లీ 'టాప్' లేపింది ఆతిథ్య జపాన్ 83 స్వర్ణాలు, 269 పతకాలతో రెండో స్థానం సాధిస్తే.. దక్షిణ కొరియా 39 పసిడి సహా 150 పతకాలతో మూడో స్థానాన్ని దక్కించుకుంది.

28లో నిలబెట్టుకున్నది 8 స్వర్ణాలే

హాంగ్జౌలో సాధించిన 28 స్వర్ణ పతకాల్లో భారత్ 8 స్వర్ణాలను మాత్రమే తిరిగి గెలిచింది. ముఖ్యంగా వ్యక్తిగత, పెయిర్ (జంట) ఈవెంట్లలో వచ్చిన 13 స్వర్ణాల్లో ఒక్కటి కూడా నిలబెట్టుకోలేకపోవడం ఆందోళన కలిగించే అంశం. అదే సమయంలో కొత్తగా 13 విభాగాల్లో భారత క్రీడాకారులు చాంపియన్లుగా అవతరించడం మాత్రం భవిష్యత్తుపై ఆశలు రేపుతోంది. అంటే భారత్ వద్ద కొత్త ప్రతిభ కొరవడలేదు. ఆ ప్రతిభను నిరంతర విజయాలుగా మార్చడం, ఒక తరం నుంచి మరో తరానికి విజయాలను కొనసాగించడం ఇప్పుడు అసలు సవాలుగా మారింది.

టీమ్ ఈవెంట్ల తడాఖా

ఈ ఆసియాడ్‌లో భారత్ నాలుగో స్థానం అందుకోవడంలో కీలక పాత్ర టీమ్ ఈవెంట్లలో మంచి ప్రదర్శనే. క్రికెట్, హాకీ, కబడ్డీ పురుషుల, మహిళల జట్లు డబుల్ ధమాకా మోగిస్తూ ఏకంగా ఆరు స్వర్ణాలను అందించాయి. హాకీలో పురుషుల జట్టు టైటిల్ నిలబెట్టుకుంటే.. మహిళల జట్టు 44 ఏండ్ల నిరీక్షణకు తెరదించింది. క్రికెట్‌లోనూ భారత్ తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. హాకీ, క్రికెట్ జట్లు ఒలింపిక్స్ బెర్తు కూడా దక్కించుకోగా.. కబడ్డీలోనూ అమ్మాయిలు, అబ్బాయిలు మరోసారి చాంపియన్లుగా నిలిచి అంచనాలను అందుకున్నారు. నిరాశపరిచిన షూటర్లు, అథ్లెట్లు, షట్లర్లు ఆసియాడ్‌లో ఎక్కువ పతకాలు అందించే షూటింగ్, అథ్లెటిక్స్ విభాగాల్లో ఈసారి ఆశించిన ఫలితాలు రాలేదు. గత ఎడిషన్లో 7 స్వర్ణాలు సహా 22 పతకాలు సాధించిన భారత షూటర్లు ఈ సారి 15 మెడల్స్ కే పరిమితమయ్యారు. ఇందులో గోల్డ్ మూడే. డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ మను భాకర్‌పై భారీ అంచనాలు ఉండగా ఆమె నిరాశపరిచింది. అయితే ట్రాప్ షూటర్ నీరూ దండా రెండు స్వర్ణాలు, రజతం గెలవడం, 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ విభాగంలో సురుచికమల్‌జీత్ తెచ్చిన స్వర్ణం ఊరటనిచ్చింది. ఇక, అథ్లెటిక్స్‌లో గాయం కారణంగా జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా దూరం కావడం భారత్‌కు భారీ లోటు. షాట్ తజీపుట్‌లో తజిందర్ హ్యాట్రిక్ స్వర్ణంపై కన్నేసినా రజతంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. జ్యోతి యర్రాజి వంటి కీలక అథ్లెట్లను కూడా గాయాలు దెబ్బతీశాయి. గత ఎడిషన్‌లో 6 గోల్డ్ మెడల్స్ వచ్చిన అథ్లెటిక్స్‌లో ఈసారి ఒకే ఒక్క స్వర్ణం మహిళల 4ఐ400 మీటర్ల రిలే టీమ్ అందించింది. ఇక, టెన్నిస్‌లో 4 దశాబ్దాల తర్వాత ఒక్క పతకం కూడా రాలేదు. బ్యాడ్మింటన్‌లో పురుషుల టీమ్ ఏకైక పతకం అది కూడా కాంస్యం మాత్రమే గెలిచి నిరాశ పరిచింది.

